
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నన్నా చూస్తూ ఊరుకుంటానా!

ఈయనెవరో గుర్తుపట్టారా.. కమిషనర్ రాహుల్ మీనా.. ఎక్కడైనా సమస్య ఉందని ఫిర్యాదు వస్తే చాలు వాలిపోతున్నారు.. పరిష్కరించేలా ఆదేశాలిస్తున్నారు.. ఇది ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్.. నిత్యం రద్దీగానే ఉంటుంది.. ఆ కేంద్రంపై ఏం ఫిర్యాదు వచ్చిందో ఏమిటో కానీ.. గురువారం మధ్యాహ్నం భోజన సమయంలో ఆకస్మికంగా వచ్చారు.. ఇలా తనిఖీ చేశారు. ఆహారంలో నాణ్యత తగ్గితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.. ప్రజలతో మాట్లాడారు.. ప్రజాభిప్రాయం తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. - రాజమహేంద్రవరం సిటీ



వందే..మాతరం



ఆ తరమే కాదు.. ఈ తరం కూడా వందేమాతరం అనాల్సిందే.. ఆలపించాల్సిందే.. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఈ పాట ను బెంగాలీ కవి బంకించంద్ర చటోపాధ్యాయ వందేమాతర గీతాన్ని సంస్కృతం, బెంగాలీ భాషల్లో 1875లో రచించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ తొలిసారి 1896లో కోల్‌కతాలో జరిగిన భారతీయ జాతీయ కాం గ్రెస్ సమావేశంలో పాడారు. ఈ పాటకు శుక్రవారం నాటికి 150 ఏళ్లు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..

4

కోపంలో.. కన్న తండ్రినే చంపేశాడు!

సోదరి పెళ్లి విషయమై ఘర్షణ

తన కోపమే తన శత్రువు.. తన శాంతమే తనకు రక్ష.. ఈ మాట అక్షరసత్యం.. అప్పటి వరకూ ఆ కుటుంబంలో అంతా ప్రశాంతం.. అమ్మా నాన్నా.. ఇద్దరు అక్కచెల్లెళ్లు .. ఒక తమ్ముడు.. ఇటీవలే ఇల్లూ కట్టుకున్నారు.. అంతా ఆనందమే.. గురువారం రాత్రి ఒక్కసారిగా ఆ ఆనందం అంతా ఆవిరైపోయింది.. కొద్ది రోజులుగా రెండో కుమార్తె పెళ్లి విషయంలో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి.. గురువారం రాత్రి గొడవ జరిగింది.. ఇదంతా కుమారుడు చూస్తూనే ఉన్నాడు.. తట్టుకోలేకపోయాడు.. కోపంలో తండ్రిని ఒక గెంటు గెంటాడు.. అంతే గోడకు తగిలి తండ్రి కింద పడిపోయాడు.. అదే కోపంలో కూరగాయలు కోసే చాకుతో తండ్రి గొంతు కోసేశాడు.. చిన్నతనం నుంచి పెంచి పెద్ద చేసిన తండ్రిని కోపం దూరం చేసింది.. అతను జైలు పాలయ్యేలా చేసింది.. అతని కోపం అతని పాలిట శత్రువుగా మారింది.

5



తూర్పోదయం!

సరికొత్తగా తూర్పుగోదావరి..?

తూర్పుగోదావరి అతి పెద్ద జిల్లాగా ఆవిర్భవించనుంది.. జిల్లాకు కొత్త స్వరూపం రానుంది.. సరిహద్దులు మారనున్నాయి. రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటికే పశ్చిమలో ఉన్న మూడు నియోజక వర్గాలు విలీనం అయ్యాయి.మరో రెండు నియోజకవర్గాలు తూర్పున విలీనమయ్యే అవ కాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తూర్పున నియోజ కవర్గాల సంఖ్య 9కి చేరనుంది. మంత్రుల కమిటీ సూచనలు అమలైతే అతి పెద్ద జిల్లాగానూ ఆవిర్భవించనుంది.

- మారనున్న జిల్లా స్వరూపం
- మండపేట నియోజకవర్గం విలీనం
- రంపచోడవరం విలీనమా.. ప్రత్యేక అథార్టీనా
- ఆ రెండూ విలీనమైతేనే 9 నియోజకవర్గాలు
- 10న కేబినెట్‌లో నిర్ణయం
- డిసెంబర్ 31కి ముందే ప్రక్రియ పూర్తి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలో మండపేట నియోజకవర్గం, ఏజెన్సీ ప్రాంతమైన రంపచోడవరం నియోజకవర్గం కలిసే అవకాశాలపై మంత్రుల కమిటీ చర్చించిన సంగతి తెలిసిందే. ఈనెల 10వ తేదీన అమరావతిలో జరిగే మంత్రివర్గ సమావేశంలో వీటిపై పూర్తి స్పష్టత రానుంది. మొత్తం ప్రక్రియ ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ లోపు పూర్తి కావాల్సి ఉంది. 2026 జనవరిలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ ఆరంభం కానుంది. ఈలోపే జిల్లాల పునర్విభజన ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. ఈ నేప థ్యంలో 10వ తేదీన కేబినెట్ మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్న తర్వాత జిల్లాల పునర్విభజన ప్రకటన వెలువడే అవకాశముంది. దాని తర్వాతే గెజిట్ జారీ చేస్తారు.

2022లో పునర్విభజన

2022లో జిల్లాల పునర్విభజన జరిగిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వం హడావుడిగా పార్లమెంట్ పరిధిని జిల్లాగా నిర్ణయిస్తూ జిల్లాల పునర్విభజన చేసేసింది. అప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను మూడు ముక్కలు చేసి తూర్పుగోదావరి, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ జిల్లాలుగా విభజించింది. కొత్త తూర్పుగోదావరి జిల్లాగా రాజమండ్రి, కొవ్వూరు డివిజన్లను కలిపి ఏర్పాటు చేసింది. నాడు మండపేట నియోజకవర్గాన్ని అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కలపడాన్ని అక్కడ ప్రజలు, ప్రజాప్రతినిధులు వ్యతిరేకించారు. ఎందుకంటే బొమ్మూరులో ఉన్న జిల్లా కలెక్టరేట్ కొద్ది దూరంలో ఉంటుంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఆలోచించి మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపడానికి నిర్ణయించింది. దీంతో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు మూడు తూర్పుగోదావరి జిల్లాలో కలవనున్నాయి. మండపేట, రంపచోడవరం నియోజకవర్గాలు విలీనమైతే 9 నియోజకవర్గాలతో తూర్పుగోదావరి పెద్ద జిల్లా కానుంది. మండపేట నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రంపచోడవరం విషయంలో 10న క్లారిటీ రానుంది.

కోనసీమ వద్దు.. కాకినాడ ముద్దు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రపురంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని అఖిలపక్ష జేఏసీ డిమాండ్‌కు మద్దతుగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఇచ్చిన పిలుపుమేరకు గురువారం బంద్ పాటించారు. వర్తక వాణిజ్య, విద్యా సంస్థలు, బార్ అసోసియేషన్ స్వచ్ఛందంగా బంద్ పాటించారు. రాజగోపాల్ సెంటర్ నుంచి జీవిత బీమా కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. కోనసీమ వద్దు, కాకినాడ ముద్దు అంటూ నినాదాలు చేశారు. 52 పంచాయతీలు, పురపాలక సంఘం రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడలో కలపాలని తీర్మానించాయని జేఏసీ నాయకులు అన్నారు. జేఏసీ కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో కన్వీనర్ బి.సిద్దు, చాంబర్ నాయకులు పసుపులేటి సత్తిబాబు, బార్ అధ్యక్షుడు వుండవిల్లి గోపాలరావు, గాదంశెట్టి శ్రీధర్, గొల్లపల్లి కృష్ణ, కౌన్సిలరు అంకం శ్రీను, టీడీపీ నాయకులు నారపురెడ్డి బలరామ్ తదితరులు పాల్గొన్నారు.



ఇలా చేయండి : రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడలో విలీనం చేయాలని ప్రదర్శన

రంపచోడవరం ఇలా...

ఏజెన్సీ పూర్వపు తూర్పుగోదావరి జిల్లాలోనే ఉండేది.2022లో జిల్లాల పునర్విభజన తర్వాత అల్లూరి సీతారామరాజు పేరిట ఏర్పడిన పాడేరు జిల్లాలోని రంపచోడవరం నియోజకవర్గంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతాన్ని కలిపారు. 200 కిలోమీటర్ల దూరంలోని పాడేరు కలెక్టరేట్ పరిధిలోకి తేవడంతో చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రంపచోడవరం, చింతూరు డివిజన్లతోపాటు పోలవరం ముంపు ప్రాంతాలను కలిపి ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని కొందరు లేదా, తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని కొందరు ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. దీంతో మంత్రుల ఉప కమిటీ ఇక్కడి పరిస్థితులపై సమీక్షించింది. పోలవరం ముంపు మండలాలు, ఏజెన్సీని ప్రత్యేక అథార్టీగా ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే ప్రతిపాదన చేశారు. రంపచోడవరం నియోజకవర్గాన్ని తూర్పులో విలీనం చేసే అంశంపైనా చర్చించారు. ఏలూరు జిల్లాలో ఉన్న పోలవరం ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

మండలాల మాటేమిటి..

2022లో జిల్లాల పునర్విభజన లోక్‌సభ స్థానం యూనిట్‌గా ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించినా చాలాచోట్ల ఈ నిబంధన ఉల్లంఘించింది. దీంతో కొన్ని మండలాల పరిధిలో సమస్యలు నెలకొన్నాయి. గోపాలపురం నియోజకవర్గం పరిధిలో గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాలు తూర్పుగోదావరి జిల్లాలో.. చిన వెంకన్న ఆలయం ఉన్న ద్వారకా తిరుమల ఏలూరు జిల్లాలో కలిపారు. కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం పరిధిలోని గోకవరం మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలిపారు. అనపర్తి నియోజకవర్గంలోని పెదపూడిని కాకినాడ జిల్లాలో కలిపారు. ఆయా మండలాల ప్రజల సమస్యలు పెరిగాయి.. ఎమ్మెల్యేలు, ఎంపీ వంటి ప్రజాప్రతినిధులు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారు.. కలెక్టర్, ఆర్డీవో, ఇతర అధికారులు వేరే జిల్లాలకు చెందిన వారు. తూర్పు కలెక్టరేట్‌తో వీరి సం బంధాలు లేకుండాపోయాయి. వీటిపై ప్రస్తుత ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.



ఎన్నికల అధికారి వీసీలో కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘాస్వరూప్, డీఆర్‌వో సీతారామ్మూర్తి

ఇక సచివాలయాలు కాదు..

విజన్ యూనిట్లు

- నేటి నుంచి మనమిత్ర క్యాంపెయిన్
- కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయాలను ప్రభుత్వం విజన్ యూనిట్లుగా మార్పు చేసిందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇకపై సచివాలయాలు అనే పేరు తొలగించి విజన్ యూనిట్లుగా పిలుస్తారన్నారు. జిల్లాలో శుక్రవారం నుంచి వాట్సప్ ఆధారిత సేవలు 'మన మిత్ర'పై క్యాంపెయిన్‌ని ప్రారంభిస్తున్నామని తెలిపారు.ఇకపై ప్రతి శుక్రవారం గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వాట్సప్ సేవల డెమో, క్యూ ఆర్ కోడ్ గురించి కరపత్రాలను అందజేసి అవగాహన కల్పిస్తారన్నారు. ఈ క్యాంపెయిన్ ఉన్న రోజున అత్యవసర వైద్య కారణాలు మినహా సెలవు మంజూరు చేయడం జరగదన్నారు. డీఎల్‌డీవోలు ప్రతి శనివారం నివేదిక సమర్పించాలన్నారు.

పోషకాహారం లోపం రానివ్వొద్దు..

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పిల్లల పోషకాహార స్థితిని క్రమం తప్పకుండా పరిశీలించి, ప్రమాదస్థితిలో ఉన్న చిన్నారులను వెంటనే గుర్తించాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. తక్కువ బరువు, తగిన ఎత్తు లేకపోవడం, బలహీనస్థితి తదితర సమస్యలున్న చిన్నారులపై అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా శిశు సంరక్షణ విభాగం, శిశు సంరక్షణ సంస్థల పనితీరుపై కలెక్టర్ సమీక్షించారు. పోషకాహారలోపం ఉన్న పిల్లలకు అదనపు పోషకాహారం, వైద్య పరీక్షలు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన సమయంలో టీవీలు ఆన్ చేయరాదన్నారు. 104 వాహనాలు వచ్చినపుడు అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి టి.శ్రీదేవి, లేడీ ఆర్గనైజర్ ఏ.రాజ్యలక్ష్మి, ఇన్‌ఛార్జి జిల్లా శిశు సంరక్షణ అధికారి ఆర్.అనంత ప్రదీప్ పాల్గొన్నారు.

ఓట్ల ప్రక్రియ వేగవంతం

రాజమహేంద్రవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఓటరు నమోదు ప్రక్రియను వేగ వంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఏపీ ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ రాష్ట్రంలోని జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వెలగపూడి నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో గురువారం సమీక్షించారు. జిల్లాలో ఫారం 6,7,8కి సంబంధించి 20,344 దరఖాస్తులు రాగా 20,114 పరిష్కరించామన్నారు. 230 ఫారాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు.బీఎల్‌వో, ఏఈఆర్వో, ఈఆర్వో స్థాయిల్లో తుది పరిశీలన జరుగుతుందని, చిరునామా ధ్రువీకరణ,పలు పత్రాల లోపం వంటి కారణాలతో కొంత ఆలస్యం అవుతోందన్నారు.వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.బుక్ ఏ కాల్ విత్ బీఎల్‌వో సేవకు సంబంధించి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 65 అభ్యర్థనలు స్వీకరించి 40 సమాధానాలు పంపగా 24 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లో అత్యధికంగా 14 పెండింగ్ అభ్యర్థనలు ఉన్నాయన్నారు.జేసీ వై.మేఘ స్వరూప్, డీఆర్వో టి.సీతారామమూర్తి పాల్గొన్నారు.



బిక్కవోలులో షష్ఠి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

26న బిక్కవోలులో షష్ఠి ఉత్సవాలు

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికారులకు సూచించారు.మండలంలోని అన్ని శాఖల అధికారులతో ఈ నెల 26న నిర్వహించే షష్ఠి ఉత్సవంపై గురువారం సమావేశం నిర్వహించారు.భక్తులకు అసౌకర్యం కలగకుండా దర్శనాలు కల్పించాలన్నారు. ఆలయం లోపల ఇరుకుగా ఉంటుంది కాబట్టి భద్రత కట్టుది ట్టంగా ఉండాలన్నారు.బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయ అభివృద్ధికి సేకరించిన రూ.కోటి విలువైన భూములను దేవదాయశాఖ పేరున రిజిస్ట్రేషన్ చేసిన దస్తావేజులు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి కమిటీ సభ్యులు అందజేశారు. ఆలయ అభివృద్ధికి రెండున్నర ఎకరాలు భూమినిస్తే దేవదాయశాఖ రూ.3.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు.రాజకీయాలకతీతంగా కమిటీ సభ్యులు భూములను సేకరించడం అభినందనీయమన్నారు. మరో 1.5 ఎకరాల భూమిని సేకరించే పనిలో ఉన్నారన్నారు.దస్తావేజులను జిల్లా దేవదాయశాఖాధికారి ఈవి.సుబ్బారావుకు ఎమ్మెల్యే అందజేశారు. షష్ఠి ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లి శ్రీనివాస రెడ్డి, ఆర్డీవో కె. కృష్ణనాయక్, డీఎస్పీ బి.విద్య, అనపర్తి సీఐ సుమంత్, తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్,ఈవో ఆకెళ్ల భాస్కర్, సర్పంచ్ సుమలత, కూటమి నేతలు పాల్గొన్నారు.

బైక్‌పై విన్యాసాలు చేస్తూ.. విద్యార్థులపై పడ్డారు!

- ఐదుగురు విద్యార్థులకు గాయాలు
- వేగేశ్వరపురంలో ఘటన
- ప్రైవేటు ఆసుపత్రికి తరలింపు

తాళ్లపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు యువకులు బైక్‌పై చేసిన విన్యాసాలు ఐదుగురు విద్యార్థులు పాలిట శాపంగా మారాయి. మండలంలోని వేగేశ్వ రపురం ఉన్నత పాఠశాల వద్ద గురువారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన కాపూరి అబి, తాళ్లపూడికి చెందిన నక్కా అఖిల్ సుజికి జిక్సర్ బైక్‌పై అమ్మాయిలను చూస్తూ బైక్‌పై హడావుడి చేశారు. ఇదిలా ఉండగా ఆ సమయంలో బైక్ అదుపుతప్పి మరో బైక్‌పై పడడంతో ఇంటికి వెళ్లడానికి బస్టాండ్ సెంటరులో నిలుచున్న ఐదుగురు విద్యార్థులను బైక్ ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాల పాలైన విద్యార్థులు బోడపాటి నందిని, గండి శ్రీలక్ష్మి, మెల్లిమి పోసమ్మ, బోడపాటి ధరణి, ఎక్కిశెట్టి చైతన్యను చికిత్స నిమిత్తం స్థానికులు తాళ్లపూడిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు ప్రమాద సమాచారం అందిన వెంటనే అక్కడ ఉన్న బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఇద్దరు యువకులు పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం.



మూతపడెన్!

ఆరు నెలలుగా రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కేంద్రం మూత

- ఇద్దరు సిబ్బంది మధ్య గొడవలే కారణం
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- 6 నెలలుగా ఆగిన శిక్షణ
- అయోమయంలో తల్లిదండ్రులు
- భయంకరంగా మారిన పరిసరాలు
- శిక్షణకు తల్లిదండ్రుల డిమాండ్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రైల్వే స్కౌట్ అండ్ గైడ్స్ విషయంలో దక్షిణ మధ్య రైల్వే అధికారుల తీరు విస్మయానికి గురిచేస్తోంది. ఇద్దరు ఉద్యోగుల మధ్య వైరం చినికి చినికి పిల్లలకు శిక్షణ ఆగిపోయే వరకూ వెళ్లింది. ఈ నేపథ్యంలో ఆరు నెలల నుంచీ డెన్ (శిక్షణ ఇచ్చే ప్రదేశం)కి తాళాలు వేసి ఉన్నా పట్టించుకొనే అధికారి కానరావడం లేదు. ఈ గొడవల కారణంగా తర్ఫీదు తర్వాత సంగతి.. పిల్లల సమయం పాడవుతుందనే ఉద్దేశంతో ఆ తల్లిదండ్రులు శిక్షణను పక్కన పెట్టేశారు. ఎంతో విశిష్టత ఉన్న సంస్థ పట్టాలు తప్పడం.. చిన్న పాటి సమస్యను పరిష్కరించలేని అధికారుల నిర్లక్ష్యం విమర్శలకు తావిస్తోంది.

ఏం జరిగింది?

దక్షిణ మధ్య రైల్వేలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగానికి రాజమండ్రి రైల్వే స్టేషన్ తూర్పు వైపున డెన్‌కి రైల్వే ప్రదేశాన్ని కేటాయించింది. సుమారు 30 వరకూ సిమెంటు బెంచీలను ఏర్పాటు చేసింది. అయితే ఎప్పటి నుంచో శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్‌ని కాదని మూడేళ్ల కిందట వచ్చిన మరో వ్యక్తి అజమాయిషీ చేయడం మొదలుపెట్టాడు. గ్రూపు గొడవలు అతని వల్లనే మొదలయ్యాయని చెబుతున్నారు. ఈ గలాటాలో డెన్‌కి తాళం పడింది. ఇక్కడ శిక్షణ తీసుకునే వాళ్లకు ఒక వాట్సాప్ గ్రూపు ఉంది. అయితే గందరగోళం వల్ల ఆ గ్రూపు నుంచి చాలా మంది తొలగి పోయారు. ఇప్పుడు ఎందరున్నారనే విషయం కూడా అయోమయంగానే ఉందని చెప్పవచ్చు. చివరికి అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ కమిషనర్ కూడా రాజీనామా చేసి వెళ్లిపోవడంతో ఆయన కార్యా లయానికీ తాళం పడింది. గందరగోళానికి కారణమైన ఉద్యోగిని అధికారులు బదిలీ చేశారు. ఆపై డెన్‌ని పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో ఇక్కడ పరిసరాలు భయానకంగా తయారయ్యాయి. రాత్రి వేళ మాట అటుంచితే పగటి వేళ కూడా ఇక్కడ ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే బయటకు తెలియడం కష్టమనే చెప్పారు. ఈ డెన్ మూతబడిన సుమారు ఓ నెలకు ఒక వ్యక్తి ఇదే డెన్‌లోని ఓ చెట్టుకింద సిమెంటు బెంచీలో విగతజీవిగా మారాడు. 15 రోజుల తర్వాత ఈ దారుణం వెలుగుచూసింది. ఇంత అభద్రత ఉన్నా రైల్వే అధికారులు ఈ డెన్ విషయంలో ఈనాటికీ మేల్కొనలేదు. డెన్ మెయిన్ గేటుకు తాళం వేయడంతో మరో దారి అనధికారికంగా ఏర్పడింది.దీంతో అసాంఘిక కార్యకలాపాలు జరుగు తున్నాయి.అధికారులు స్పందించి స్కౌట్స్ శిక్షణ ఆరంభించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఐదేళ్ల నుంచి శిక్షణ..

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఐదేళ్ల నుంచీ 25 ఏళ్ల వరకూ వివిధ అంశాల్లో ఆదివారాలు,బడుల సెలవు రోజుల్లో తర్ఫీదు ఇస్తారు. దాదాపుగా మిలిటరీ ట్రైనింగ్ మాదిరిగానే ఉంటుంది. రోజూ ఉదయం, సాయంత్రం యోగా నేర్పిస్తారు. శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, మానసిక స్థైర్యం, ధైర్యం అలవడతాయి. 25 ఏళ్లు వచ్చే సరికి సామర్థ్యాన్ని బట్టి రాష్ట్రపతి అవార్డు అందుకుంటారు. శిక్షణలో వివిధ ప్రాంతాల్లో క్యాంపులకు తీసుకెళతారు.రైల్వేతో పాటు ఇతర శాఖల్లోని ఉద్యోగ నియా మకాల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కి ప్రత్యేక కోటా ఉంటుంది.రాజమహేంద్రవరంలో ఈ కోటాలో ఉద్యోగం వచ్చిన వారు ఇద్దరు ప్రస్తుతం పనిచేస్తున్నారు. విజయవాడ డివిజన్ ఉద్యోగాల్లో ఇతర డివిజన్ల వాళ్లకు అవ కా శమిస్తుండడంతో ఇక్కడ శిక్షణ తీసుకున్న వాళ్లకు అన్యాయం జరుగుతోందనే ఆవేదన ఉంది.



తుప్పలతో నిండిన రైల్వే స్కౌట్స్ శిక్షణ కేంద్రం ప్రాంగణం



అనధికారికంగా ఏర్పడిన దారి

మొంథా నష్టం రూ.38.2 కోట్లు

- వరి,మినుము పంటల నష్టం
- ప్రభుత్వానికి నివేదిక

రాజమహేంద్రవరం,నవంబరు6(ఆంధ్రజ్యోతి) :మొంథా తుఫాన్‌కు దెబ్బతిన్న పంట నష్టం తేలిందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు.ఈ మేరకు గురువారం ఆయన పంట నష్టం వివరాలు వెల్లడించారు. 31074 మంది రైతులకు చెందిన 47740 హెక్టార్లలో సర్వే చేయగా 15742.53 హెక్టార్లలో ఎన్యూమరేషన్ చేశామన్నారు.15667.56 హెక్టార్లలో పంటకు నష్టం జరిగినట్టు తేల్చారు. 74.96 హెక్టార్లను తిరస్కరించారు. దీంతో మొత్తం ఎన్యూమరేషన్ పూర్తయినట్టు ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక కూడా పంపామన్నారు. వీటికి ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం వివ రాలు తెలిపారు.వరి హెక్టారుకు రూ.25 వేలు వంతున 14602.83 హెక్టార్లకు రూ.36.5 కోట్లు,మినప పంటకు హెక్టారుకు రూ.15 వేల వంతున 1135.777 హెక్టార్లలో పంటకు సుమారు 1.7 కోట్లు నష్టపరిహారం ఇస్తారని తెలిపారు.




డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరు ప్రాథమిక పాఠశాలలో వందేమాతరం గీతాలాపన రిహార్సల్స్ నిర్వహిస్తున్న విద్యార్థులు

వందేమాతరం సమర నినాదం




డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాలలో వందేమాతరం, 150 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

బెంగాలీ కవి బంకించంద్ర చటోపాధ్యాయ వందేమాతర గీతాన్ని సంస్కృతం, బెంగాలీ భాషల్లో 1875లో రచించారు. దీనిని తొలుత ఆయన 1882లో రచించిన నవల ఆనంద మఠంలో ప్రచురించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఈ పాటను రవీంద్రనాథ్ ఠాగూర్ తొలిసారి 1896లో కోల్‌కతాలో జరిగిన భారతీయ జాతీయ కాంగ్రెస్ సమావేశంలో పాడారు. సుమారు మూడు నిమిషాలకు పైగా నిడివితో పూర్తిగా ఐదు పాదాలు ఉండే ఈ వందేమాతరం గీతంలో కేవలం రెండు చరణాలనే ఇప్పటి వరకు పాడుతున్నాం. మిగిలిన పాదాలు అంత ప్రాచుర్యంలో లేవు. అయితే ఆ మిగిలిన మూడు పాదాలను కూడా ప్రజల్లోకి తీసుకు వెళ్లే ప్రయత్నానికి భారతీయ జనతా పార్టీ శ్రీకారం చుట్టింది. అందరితోనూ వందేమాతరాన్ని పూర్తిగా పాడించేందుకు సిద్ధమైంది.

వందేమాతర గీతం శుక్రవారం నాటికి 150 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా "స్వరాజ్యం-స్వదేశీ-సమైక్యత" నినాదంతో బీజేపీ రాష్ట్ర శాఖ ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తోంది. ఐదు చరణాలతో మూడు నిమిషాల నిడివి ఉన్న వందేమాతరం పూర్తి గీతాన్ని ఆలపించేలా ఆ పార్టీ కాకినాడ జిల్లా శాఖ ఏర్పాట్లు చేస్తోంది. కాకినాడ గాంధీనగర్ పార్కులో సుమారు పదివేల మంది విద్యార్థులతో గీతాన్ని పాడించేందుకు సన్నాహాలు చేస్తోంది. శుక్రవారం సాయంత్రం ఐదు నుంచి రాత్రి ఏడు గంటల మధ్య ఈ కార్యక్రమం జరగనుంది.



వందేమాతరం గీతం అప్పట్లో రాజమహేంద్రవరం యువతను తొలిసారిగా ఉద్యమాలవైపు నడిపించిందని చరిత్ర ద్వారా తెలుస్తోంది. 1907 ఫిబ్రవరిలో స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి గాడిచర్ల హరిసర్వోత్తమరావు నేతృత్వంలో ఓ బృందం ఉద్యమించింది. ఈ పరిణామాన్ని అప్పటి ప్రిన్సిపాల్ హంటర్ సహించలేక విద్యార్థులకు హెచ్చరికగా హరిసర్వోత్తమ రావును కాలేజీ నుంచి బహిష్కరించాడని, అయినా సరే ఎవరూ బెదరకుండా ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు.



ప్రస్తుతం వాడుకలో ఉన్న వందేమాతరం

వందేమాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం
వందేమాతరం.. వందేమాతరం

శుభ్రజ్యోత్స్నా పులకితయామినీం
పుల్లకుసుమిత ద్రుమదుల శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం
వందేమాతరం.. వందేమాతరం

(వాస్తవానికి ఇక్కడ వరకే అందరూ వందేమాతర గేయాన్ని ఆలపిస్తున్నారు. స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో, దేశ భక్తిని పెంపొందించే కార్యక్రమాల్లో, స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల్లోనూ ఈ రెండు పాదాలతోనే సరిపెడుతున్నారు. మిగిలిన మూడు చరణాల ప్రస్తావన లేదు)

కోటి కోటి కంఠ కలకల నినాదకరాలే
కోటి కోటి భుజైర్ ధృత కర కరవాలే
అబలా కేయనో మా ఏతో బలే..
బహుబల ధారిణీం నమామి తారిణీం
రిపుదలవారిణీం మాతరామ్
వందేమాతరం... వందేమాతరం

తుమి విద్యా తుమి ధర్మ
తుమి హృది తుమి మర్మ
త్వం హి ప్రాణాః శరీరే
బాహుతే తుమి మా శక్తి హృదయే
తుమి మా భక్తి
తో మారయి ప్రతిమా గడి మందిరే మందిరే
వందేమాతరం... వందేమాతరం

త్వం హి దుర్గా దశ ప్రహరణ ధారిణీ
కమలా కమలదళ విహారిణీ
వాణీ విద్యాదాయినీ
నమామి త్వాం
నమామి కమలాం అమలాం అతులాం
సుజలాం సుఫలాం మాతరమ్
వందేమాతరం... వందేమాతరం

శ్యామలాం సరలాం సుస్మితాం భూషితాం
ధరణీం భరణీం మాతరం
వందేమాతరం...
వందేమాతరం...


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

కాకినాడలో నేడు సామూహిక గీతాలాపన

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతాన్ని బంకించంద్ర ఛటర్జీ జాతికి అందించి శుక్రవారానికి 150 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా చారిత్రక ప్రాధాన్యం కలిగిన కాకినాడ గాంధీనగర్ పార్కు వద్ద సంబరాలు నిర్వహిస్తున్నట్టు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పి.సురేష్ తెలిపారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1923లో కాకినాడ గాంధీనగర్ పార్కులో కాంగ్రెస్ జాతీయ మహాసభలు జరిగాయని, వందేమాతరం ఆలపించమని విష్ణు దిగంబర్ పాలుస్కర్‌ను వేదికపైకి ఆహ్వానించారన్నారు. ఆయన గీతాలాపన చేస్తుండగా అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు మౌలానా మహమ్మద్ ఆలీ ఈ గీతం తమ మతానికి వ్యతిరేకంగా ఉందని అడ్డగించారన్నారు. ఆనాటి అవమానకర సంఘటనకు, చారిత్రక తప్పిదానికి వేదికగా నిలిచిన గాంధీనగర్ పార్కులోనే సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు.

జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం గాంధీనగర్ పార్కు వద్ద జరిగే సామూహిక వందేమాతర సామూహిక గీతాలాపన కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి రాధామోహన్‌దాస్ అగర్వాల్ హాజరవుతారని తెలిపారు. దేశభక్తులు, నగరవాసులు హాజరై విజయంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ రామ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వర్మ, రమేష్, సురేష్, జ్యోతుల రాజేష్, యెనిమిరెడ్డి మాల కొండయ్య, గౌతు చిన్న తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువులో తూర్పు నగరవనం


నగరవనం ఏర్పాటు కానున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

- 125 ఎకరాల భూమిలో ఏర్పాటు
- వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి
- తూర్పు అటవీ అధికారి ప్రభాకరరావు

దివాన్‌చెరువు, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిని ఆనుకుని దివాన్‌చెరువు తూర్పు అటవీ ప్రాంతంలో నగరవనం ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా అటవీ అధికారి వి.ప్రభాకరరావు తెలిపారు. ఈ నగరవనం ఏర్పాటు కానున్న దివాన్‌చెరువు నుంచి గైట్ కళాశాల మధ్య గల అటవీ ప్రాంతాన్ని హైదరాబాద్ నుంచి వచ్చిన ఆర్కిటెక్ట్ గౌరీశంకర్‌తో కలిసి డీఎఫ్‌వో ప్రభాకరరావు గురువారం క్షేత్రపరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివాన్‌చెరువు తూర్పు అటవీ ప్రాంతంలో దాదాపు 125 ఎకరాల అటవీ భూమిలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నగరవనం మంజూరు అయ్యిందని తెలిపారు. ప్రస్తుతం అటవీశాఖ ఆధ్వర్యంలో సందర్శకులకు ఆరోగ్యం, అహ్లాదం తోబాటు అవగాహనను పంచుతున్న లాలాచెరువు సమీపంలోని గోదావరి మహాపుష్కరవనం కంటే మరింత ఆకర్షణీయంగా ఈ నగరవనాన్ని తీర్చిదిద్దనున్నామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి దీనిని పూర్తిచేస్తామని అన్నారు. కాగా ప్రస్తుతం లాలాచెరువు వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గోదావరి మహాపుష్కరవనం దాదాపు పదేళ్ల క్రితం గోదావరి మహాపుష్కరాలు సందర్భంగా సీఎం చంద్రబాబు చేతులమీదుగా 2015లో శంకుస్థాపన చేయగా 2016 నవంబరు 19న ప్రారంభించారని ఈ సందర్భంగా డీఎఫ్‌వో గుర్తుచేశారు. ఇదిలా ఉండగా రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందీశ్వరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సూచనల మేరకు అంతర్జాతీయ ప్రమాణాలున్న జూసఫారీని ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ ఒ.దావీదురాజు, డీఆర్వో పద్మావతి, బీట్ అధికారి గళ్లా రంగారావు పాల్గొన్నారు.

నేడు అంతర జిల్లాల ఎస్‌జీఎఫ్ జూడో చాంపియన్ షిప్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 69వ రాష్ట్ర అంతర జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జూడో ఛాంపియన్ షిప్ అండర్ 17 బాల, బాలికలు పోటీలు గురువారం కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్‌లో జరగనున్నాయి. ఈ పోటీలు నవంబరు 7 నుంచి 9 వరకు జరుగుతాయని తెలిపారు. పోటీలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ సగిలి షాన్ మోహన్, జిల్లా విద్యాశాఖాధికారి, స్కూల్ గేమ్స్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు పాల్గొనున్నారు. అండర్ 14, 17 నిర్వహణ కార్యదర్శి, పాఠశాల క్రీడా సమాఖ్య, కాకినాడ జిల్లా, టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి.సుధా రాణి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు క్రీడాలను పరిరక్షించునున్నారు.

రోలర్ స్కేటింగ్‌లో హనీఫాకు గోల్డ్‌మెడల్

ఇతర విభాగాల్లో మరో నాలుగు పతకాలు


హనీఫాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీలు

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలో జూనియర్ ఇంటర్ (బైపీసీ) విద్యార్థిని ఎండీ హనీఫా మెహ్నాజ్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఐదు పతకాలను కైవసం చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి తెలిపారు. రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల చెన్నైలో జరిగిన రోలర్ స్కేటింగ్ మీట్‌లో 1000 మీటర్ల రేసులో స్వర్ణ పతకం, రోడ్ ల్యాప్, మిక్స్‌డ్ రిలే, 500 మీటర్ల రేసుల్లో వెండి పతకాలు, 500+డి రేసులో కాంస్య పతకం సాధించిందని పేర్కొన్నారు. ఈ విజయాలతో హనీఫా డిసెంబరులో జరుగబోయే జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తోపాటు పీడీలు వై.సుధారాణి, ఎ.నాగులు అభినందించారు.

జేఎన్టీయూకే-స్కిల్ డిజైర్ అవగాహన ఒప్పందం


ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న రిజిస్ట్రార్, స్కిల్ డిజైర్ ప్రతినిధులు

జేఎన్టీయూకే, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ, హైదరాబాద్‌లోని స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరినట్టు ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. వీసీ సమావేశ హాలులో జరిగిన ఈ ఒప్పందం ద్వారా జేఎన్టీయూకే విద్యార్థులకు స్కిల్ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, స్కిల్ డిజైర్ ద్వారా కంప్యూటర్, ఐటీ స్కిల్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తామన్నారు. వీసీ సమక్షంలో సంతకాలు చేసిన ఎంవోయూ పత్రాలను రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, స్కిల్ డిజైర్ సహ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ మార్చుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

షిప్ బిల్డింగ్ యార్డును సందర్శించిన బాషా


షిప్ బిల్డింగ్ యార్డును సందర్శిస్తున్న ఫెడరేషన్ చైర్మన్ బాషా

కాకినాడ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పోర్టు ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఖలీఫతుల్లా బాషా(సెంట్రల్ గవర్నమెంట్ నామినేటెడ్) కాకినాడ పర్యటనలో భాగంగా గురువారం ఎమ్మెల్యే వనమాడి కొండబాబును కలిశారు. పోర్టు సమస్యలపై కలిసి పనిచేసే విషయమై చర్చించారు.అనంతరం శాన్ మెరైన్ షిప్పింగ్ సంస్థ అధినేత అహ్మద్ ఆలీషాతో కలిసి షిప్ బిల్డింగ్‌యార్డ్‌ను సందర్శించారు. బాషా మాట్లాడుతూ ఎలక్ట్రిక్ షిప్పుల తయారీకి కృషి చేసిన ఆలీషాను అభినందించారు. పోర్టులో పనిచేస్తున్న వర్కర్లతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పోర్టుకు సంబంధించిన సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాషా వెంట ఏపీ ఆర్‌టీఐ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పప్పు దుర్గారమేష్, పలు సంస్థల ప్రతినిధులు ఎస్‌కే రఫీ, ఎస్‌కే ఇమామ్, హసన్ షరీఫ్, హబీబ్ బాషా ఉన్నారు.

10న అప్రెంటిస్, జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలలో వివిధ కంపనీలలో ఉన్న అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ ప్రభుత్వం ఐటీఐలో ఈనెల 10న ఉదయం 9గంటలకు ఐటీఐ పాస్ అయిన విద్యార్థులకు ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్, జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.వేణుగోపాల వర్మ తెలిపారు. జిల్లాలో గల ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్మెంట్, స్టాఫ్ వచ్చి వారికి కావలసిన అప్రెంటిస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ చేసి సెలెక్ట్ చేసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో వివిధ ట్రేడ్స్‌లో ట్రైనింగ్ కంప్లీట్ చేసి ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్, జెరాక్స్ కాపీలత పాటు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న జేఎన్టీయూలో నిర్వహిస్తున్న ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్, జాబ్ మేళాకు హాజరవ్వాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440408182 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

కాకినాడ-సామర్లకోట ఆర్టీసీ బస్సుల రూట్ మళ్లింపు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ నుంచి సామర్లకోట మధ్య రోడ్డు నిర్మాణ పనులు కారణంగా ఆర్టీసీ బస్సుల రూట్ మళ్లించినట్టు డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి సాయంకాలం 5గంటల వరకు సామర్లకోట ముత్యాలమ్మ తల్లి గుడి నుంచి కాకినాడ వరకు రోడ్డు మూసి వేయడంతో ఆర్ అండ్ బీ అధికారులు, పోలీస్ డిపార్ట్మెంట్ సూచనల మేరకు ఆ రూట్‌లో వెళ్లే బస్సులన్నీ కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి ఏపీఎస్పీ, సర్పవరం జంక్షన్, ఏడీబీ రోడ్డు మీదుగా సామర్లకోట వెళతాయని డిపో మేనేజర్ మనోహర్ పేర్కొన్నారు.

వెంకన్న ఆలయ వంట నౌకరి భూముల స్వాధీనం


వంట నౌకరి భూముల స్వాధీన బోర్డు పెడుతున్న అధికారులు

ఆత్రేయపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన వంట నౌకరి భూములను జిల్లా అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వాడపల్లిలో 27/2 సర్వే నెంబరులో 2.60 ఎకరాలు, 48/4ఏ సర్వే నెంబరులో 4.60 ఎకరాల భూమిని మార్గపురి జగన్నాథ వాసుదేవస్వామి, శేషప్రకాశ్, నరసింహకుమార్‌లకు వంట నౌకరీ భూములుగా గతంలో అందించారు. అయితే సంబంధిత వ్యక్తులు వంట నౌకరీ సరిగ్గా చేయకపోవడంతో సీసీఎల్‌సీ ఉత్తర్వులు మేరకు కోట్లాది రూపాయలు విలువైన భూములను దేవస్థానం స్వాధీనం చేసుకుంది. హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు మేరకు దేవదాయ శాఖ అధికారులు రెవెన్యూ, పోలీసు యంత్రాంగంతో వెళ్లి ఆ భూములను స్వాధీనం చేసుకున్నట్టు ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఈ భూములలోకి ప్రవేశించి ఎర్రజెండాలు పాతి స్వామివారికి చెందిన భూములుగా బోర్డులు పెట్టి స్వాధీన ప్రక్రియను పూర్తిచేశారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, రెవెన్యూ, పోలీస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థిని ఇంటర్వ్యూ చేస్తున్న ఎన్‌సీసీ అధికారి

పెద్దాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో ఎన్‌సీసీ శిక్షణకు విద్యార్థుల ఎంపిక ప్రక్రియను గురువారం నిర్వహించారు. 18 ఆంధ్ర బెటాలియన్ కాకినాడ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ అసిఫ్ మహమ్మద్ ఆదేశాల మేరకు 2025-26 శిక్షణా సంవత్సరానికి విద్యార్థులను ఎన్‌సీసీ సెలక్షన్ అధికారులు ఎంఎస్ రావు, శక్తివేల్, రానా, దిలీప్, మనీష్ ఎంపిక చేశారు. 11వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీసీ సీనియర్ డివిజన్‌లో పరుగు పోటీ, శరీర ధారుఢ్య పోటీ, మెడికల్ టెస్టులు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ఇంటర్వ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వసంత జగన్‌మోహన్, జూనియర్ డివిజన్ అసోసియేషన్ ఆఫీసర్ జాగ్రఫీ పీజీటీ ఎం.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కాకినాడ జిల్లా నైపుణ్యాధికారి(ఇన్‌చార్జి) వీడీజీ మురళి పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో రెండేళ్ల ఐటీఐ లేదా మూడేళ్ల డిప్లమోలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. గరిష్ఠంగా 30 సంవత్సరాల వయస్సు, కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలన్నారు. ఎంపికైన వారికి రెండు సంవత్సరాల ఒప్పందం మేరకు నెలకి 2,600 నుంచి 2700 యూరోలు(రూ.2.60 నుంచి రూ.2.70 లక్షలు) వేతనం లభిస్తుందని తెలిపారు. వసతి, అరైవల్ సహాయం వంటి సౌకర్యాలు అందిస్తారని తెలిపారు. అభ్యర్థులకు జర్మన్ భాషలో 12, 14 వారాల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. శిక్షణ ఫీజు 1.15 లక్షలు మూడు వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నవంబరు 15 లోగా సంబంధిత వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 99888 53335, 871265 5686, 87901 18349, నెంబర్లను సంప్రదించాలని మురళి తెలిపారు.

మురమళ్లలో ఆర్టీసీ బస్సును అడ్డుకున్న యువకులు

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

ఐ.పోలవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమలాపురం డిపో నుంచి కాకినాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సును మురమళ్ల మాణిక్యాంబ గుడి వద్ద బుధవారం రాత్రి కొందరు యువకులు అడ్డుకున్నారు. మురమళ్ల వెళ్లేందుకు ఒక మహిళ అమలాపురం కిమ్స్ ఆసుపత్రి వద్ద బస్సు ఎక్కింది. ఉచిత బస్సు ప్రయాణం నిమిత్తం ఆ మహిళ ఆధార్ కార్డు చూపించే ప్రయత్నం చేస్తుండగా అనాతవరం వద్ద నిర్మానుష్య ప్రదేశంలో కండక్టర్ ఆమెను దింపివేశారు. దీంతో ఆ మహిళ తన కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారమందించింది. దీనితో కొందరు యువకులు మురమళ్ల మాణిక్యాంబ ఆలయం వద్ద బస్సును అడ్డుకున్నారు. దీనితో యువకులకు, ఆర్టీసీ సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిగింది. గందరగోళం నెలకొంది. ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు సిబ్బందితో వచ్చి ఇరు వర్గాలను వారించారు. తప్పు జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలి గాని బస్సును అడ్డుకోవడం సరి కాదని సూచించారు. పోలీసులు ఆర్టీసీ బస్సును అక్కడి నుంచి పంపించడంతో వివాదం సద్దుమణిగింది.

పిఠాపురంలో కల్తీ నెయ్యి కలకలం

పిఠాపురంలో మరోసారి కల్తీ నెయ్యి కలకలం రేగింది. పశువుల కొవ్వు ఉపయోగించి నెయ్యి తయారు చేస్తున్నారని ఆరోపిస్తూ విశ్వహైందవ పరిషత్ ఆందోళనకు దిగడంతో అధికారులు స్పందించారు. 21డబ్బాల్లో ఉన్న పశువుల కొవ్వును సీజ్ చేశారు. గతంలో ఒకసారి ఇదే ప్రాంతాల్లో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నట్టు ఆరోపణలు రావడంతో అధికారులు కేసు నమోదుచేసి సరుకును స్వాధీనం చేసుకున్నారు.

- 21 డబ్బాల్లో కొవ్వు, కల్తీ నెయ్యి స్వాధీనం
- పశువుల కొవ్వుతో నెయ్యి తయారు చేస్తున్నారని ఆరోపణ



పిఠాపురంలో అధికారులు స్వాధీనం చేసుకున్న కల్తీ నెయ్యి, పశువుల కొవ్వు ఉన్న డబ్బాలు, విచారణ చేస్తున్న అధికారులు

పిఠాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మాధవనగర్‌లోని ఒక ఇంటిలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారనే సమాచారంతో విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు దువ్వా వెంకటేశ్వరరావు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పశువుల కొవ్వు వినియోగించి కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారని, దీనినే పవిత్రమైన ఆవు నెయ్యిగా విక్రయాలు జరుపుతూ భక్తులను మోసగించి సొమ్ము చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. గతంలోనే ఇదే రీతిలో కల్తీ నెయ్యి తయారు చేశారని తెలిపారు. కల్తీ నెయ్యి తయారీపై ము న్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. దీంతో రెవెన్యూ అధికారులు చేరుకుని ఆ ఇంటిని సీజ్ చేశారు. గురువారం సాయంత్రం పిఠాపురం పట్టణ ఎస్ఐ మణికుమార్, ఆర్ఐ వెంకటేష్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర అప్పారావు అక్కడకు చేరుకున్నారు. కల్తీ నెయ్యి తయారీకి వినియోగిస్తున్న 21 డబ్బాల్లోని జంతువుల కొవ్వుతోపాటు అక్కడ ఉన్న కల్తీ నెయ్యిను స్వాధీనం చేసుకున్నారు. శాంపిల్స్ సేకరించి ఫుడ్ కంట్రోల్ అధికారులకు పంపారు. శాంపిల్స్ సేకరించిన తర్వాత మిగిలిన జంతువుల కొవ్వును పూడ్చివేస్తామని అధికారులు తెలిపారు. తరచూ కల్తీ నెయ్యి తయారీ ఆరోపణలు వస్తున్నా నియంత్రణ గురించి అధికారులు పట్టించుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది. తాను పలుమార్లు ఫిర్యాదు చేస్తేనేకానీ అధికారులు స్పందించలేదని విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇటువంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యథేచ్ఛగా ఏలేరు మట్టి తరలింపు

- ఏలేశ్వరం గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం
- పట్టించుకోని రెవెన్యూ, జలవనరులశాఖ అధికారులు



ఏలేశ్వరంలో ఏలేరు ప్రాజెక్టు సమీపంలో అక్రమంగా తవ్వేసిన మట్టి కొండలు

ఏలేశ్వరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టు సమీపంలో ఉన్న మట్టికొండలను అక్రమార్కులు కొల్లగొట్టుకుంటూపోతున్నారు. ఏవిధమైన అను మతులు లేకుండా పగలు, రాత్రి తేడా లేకుండా ఎక్స్‌కవేటర్ సహాయంతో సుమారు 15 ట్రాక్టర్లతో తవ్వుకుంటూ పోతున్నా సంబంధిత ఏలేరు అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ మట్టిని ఇళ్లు, దుకాణాల నిర్మాణంలో పునాదులకు ఇతర అవసరాలకు తరలించి అధిక మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. రిజర్వాయర్ నుంచి వరద నీరు వచ్చే ప్రాంతానికి సమీపంలోనే మట్టి తవ్వకాలు జరగడంతో సానికంగా నివసించే ప్రజలు, పాఠశాల విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈవిధమైన తవ్వకాలతో తమకు రక్షణలేకుండాపోతుందని ప్రజలు వాపోతున్నారు. ఇలాగే తవ్వుకుంటూపోతే ప్రాజెక్టు నుంచి వచ్చే వరద నీరుతో ఏలేశ్వరం పట్టణ, రూరల్ గ్రామాలు ముంపునకు గుర య్యే అవకాశం ఉంది. ఏలేరు అధికారులకు సమస్యను వివరించినావారు పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. ట్రాక్టర్ మట్టి ను మారు రూ.3500నుంచి రూ.4500 వసూలు చేస్తూ అక్రమార్కులు లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. కాసుల కక్కుర్తితో ఏలేరు రక్షణ తమకేమీ పట్టనట్టు అధికారులు వ్యవహరించడంతో ప లు ఆరోపణలకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇకనైనా ఏలేరు, రెవెన్యూ అధికారులు చొరవచూపి అక్రమంగా తవ్వుతున్న మట్టి తవ్వకాలపై అడ్డుకట్టు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతలలో అదుపుతప్పి పడిపోవడంతో
లారీ ఢీకొని కూరగాయల వ్యాపారి మృతి



మృతిచెందిన గొల్లబ్బాయి

సామర్లకోట, నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట-శాకినాడ ప్రధాన రోడ్డులో పెద్దపెద్ద గుంతలు కారణంగా గురువారం గోవిందరాజు పాలెంనకు చెందిన కూరగాయల వ్యాపారి తన టీవీఎస్ మోపెడ్ నుంచి రోడ్డుపై పడిపోవడంతో వెనుక నుంచి వస్తున్న లారీ చక్రాల కిందపడి ఆ వ్యక్తి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం వెంకటకృష్ణరాయపురం మాధవపట్నం మధ్య చోటుచేసుకుంది. సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు సిబ్బందితో ప్రమాదానికి గురైన వాహనాలను, మృతదేహాలను రోడ్డు పక్కకు తప్పించి మృతుడి బంధువులకు సమాచారం అందించారు. మృతుడు పిఠాపురం నియోజకవర్గం గోవిం ద రాజుపాలెంనకు చెందిన సిరికిపల్లి గొల్లబ్బాయిగా పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అతి పేదరికంతో రోజూ కాకినాడ వెళ్లి కూరగాయలు ఇంటింటా అమ్ముకుని కుటుంబాన్ని పోషిస్తాడని బంధువులు తెలిపారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పి.గన్నవరం అక్విడెక్టుకు

రూ.49.30 లక్షలతో మరమ్మతు

- 40 రోజులపాటు ట్రాఫిక్‌ను మళ్లించాలి
- ఇరిగేషన్ డీఈ రవిప్రసాద్‌రాజు



పాత అక్విడెక్టును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ రవిప్రసాద్‌రాజు

పి.గన్నవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం కొత్తఅక్విడెక్టుపై జాయింట్‌ల మరమ్మతుల నిమిత్తం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చొరవతో సీఎస్ఆర్ నిధులు రూ.49.30లక్షలు మంజూరయ్యాయని పి.గన్నవరం సబ్ డివిజన్ డీఈ రవిప్రసాద్ రాజు తెలిపారు. టెండర్లు పూర్తయ్యాయని త్వరలోనే పనులు మొదలుపెడతామని ఆయన తెలిపారు. స్థానిక నీటిసంఘ అధ్యక్షులతో కలిసి గురువారం ఆయన పాత అక్విడెక్టును పరిశీలించి అనంతరం మాట్లాడారు. అక్విడెక్టుపై జాయింట్‌లు పూర్తిస్థాయిలో పాడయ్యాయని వాటి మధ్య ఎక్స్‌ఫిన్షన్ జాయింట్‌లు ఏర్పాటు చేస్తారని చెప్పారు. 33చోట్ల ఏడున్నర మీటర్లు వెడల్పుతో కూడిన ఎక్స్‌ఫిన్షన్ జాయింట్‌లు అవసరమైనచోట ఇయరింగ్ కోట్లు ఏర్పాటు చేస్తారన్నారు. అలాగే ఫుట్‌పాత్‌కు మరమ్మతులు నిర్వహిస్తామని చెప్పారు. అక్విడెక్టుపై పనిచేసే సమయంలో సుమారుగా 40 రోజులపాటు ట్రాఫిక్‌ను మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యామ్నాయంగా పాత అక్విడెక్టుపై నుంచి వాహనాలను మళ్లించే విధంగా ఆలోచన చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా పాత అక్విడెక్టు కెపాసిటీని సంబంధిత ఇంజనీర్లతో చర్చించి సామర్థ్యం మేరకు వాహనాల రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే భారీ వాహనాలను బొడసకుర్రువైపు మళ్లించే ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం డైలీ బజారును, పాత అక్విడెక్టుపైన, ఇరువైపులా ఉన్న అడ్డంకులను తొలగించి వాహనాల దారి మళ్లిస్తామని చెప్పారు. అనంతరం కొత్త అక్విడెక్టుపై పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసకుంటామన్నారు. ఎక్స్‌ఫిన్షన్ జాయింట్‌లలో ఏర్పాటుచేసే ఇనుప రాడ్లను రెండు రకాలను పరిశీలిస్తున్నామని ఉన్నతాధికారుల ఆదేశాలతో ఒక మోడల్‌ను సిద్ధం చేసి పనులు ప్రారంభిస్తారని స్పష్టం చేశారు. డీఈ వెంట పి.గన్నవరం సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ చొల్లంగి సత్యనారాయణమూర్తి, ఇసుకపూడి నీటిసంఘం అధ్యక్షుడు కె.సత్యనారాయణరాజు ఉన్నారు.

భీమేశ్వరాలయంలో వైభవంగా జ్వాలాతోరణం

దాక్షారామ,నవంబరు6(ఆంధ్రజ్యోతి):ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో గురువారం జ్వాలాతోరణం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.కృత్తిక నక్షత్రం రోజున స్వామివారి ఆలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తారు. సాయంత్రం 8 గంటలకు స్వామి వారికి సర్వదేవాతా ఆహ్వానం, దూపసేవ నిర్వహించారు. అనంతరం ప్రదోషకాల పూజ జరిపారు. నేతి జ్యోతి కాంతిలో ఉత్సవ మూర్తులతో ఆలయ ప్రదక్షిణం చేశారు. సప్తగోదావరి తీరంలో జ్వాలా తోరణం నిర్వహించారు. ఆలయ సహాయకమీషనరు అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ అర్చకులు, వేదపండితులు, స్వస్తివాచకులు, సిబ్బంది పాల్గొన్నారు.



భీమేశ్వరాలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

అంతర్వేది నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం



అంతర్వేదిలో విరాళం అందిస్తున్న కొత్తపల్లి రామకృష్ణ దంపతులు, అయినవిల్లిలో దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు, అన్నవరంలో ఏఈవో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

అంతర్వేది, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనం అనంతరం నిత్యాన్నదాన ట్రస్టుకు కడియం మండలం బుర్రిలంకకు చెందిన కొత్తపల్లి రామకృష్ణ దంపతులు రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతకు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీవీ ప్రసాద్ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి అభినందించారు.

సత్యదేవ నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గురువారం ఒకదాత రూ.1,00,016లు విరాళంగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన సీహెచ్ భరత్‌కుమార్, సాయిలక్ష్మి దంపతులు ఈ మొత్తాన్ని అన్నదాన విభాగ ఏఈవో కృష్ణారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామి వారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో అన్న దాన విభాగ ఉద్యోగులు కంచిబొట్ల రాంబాబు, బండారు రమణ తదితరులున్నారు.

అయినవిల్లి(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం వియ్యారివారిమెరక గ్రామానికి చెందిన చింతా ఉమామహేశ్వరరావు-సావిత్రి దంపతులు కుటుంబ సమేతంగా గురువారం శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.100,116 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి కార్యనిర్వహణాధికారి అభినందించారు.

పిఠాపురం నియోజకవర్గంలో చేనేత క్లస్టర్

- కేంద్ర, రాష్ట్ర అధికారుల బృందం పరిశీలన



పిఠాపురం నియోజకవర్గంలో చేనేత క్లస్టర్ ఏర్పాటుపై పరిశీలన జరుపుతున్న కేంద్ర, రాష్ట్ర అధికారులు

గొల్లప్రోలు రూరల్/కొత్తపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని చేనేత కార్మికుల నైపుణ్యాల పెంపుదల, అభివృద్ధి లక్ష్యంగా చేనేత క్లస్టర్ ఏర్పాటుపై కేంద్ర, రాష్ట్ర అధికారుల బృందం బుధ, గురువారాల్లో పర్యటించింది. చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పిఠాపురం నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాజెక్టు మంజూరు చేయాలన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనలకు అనుగుణంగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఇదే విషయంపై కేంద్ర చేనేత, జౌళిశాఖల మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో చేనేతరంగం అభివృద్ధికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మెగా షోరూం, డిజైనింగ్, డైయింగ్ యూనిట్ల ఏర్పాటు నిమిత్తం రూ.15కోట్లతో ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటుచేయాలని కోరారు. దీనిపై చెన్నైలోని దక్షిణభారత వీవర్స్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ సి.ముత్తుస్వామి, విజయవాడ వీవర్స్ సర్వీస్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌సాహూ, చేనేత-జౌళిశాఖ రాష్ట్ర ఏడీ వనజ, కాకినాడ జి ల్లా ఏడీ కె.పెద్దిరాజు, ఢిల్లీబాబు, ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ డెవలప్‌మెంట్, వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జయకృష్ణ, జాంధానీ చీరల ఉత్పత్తిదారుడు లొల్ల సత్తిపండు పరిశీలించారు. గొల్లప్రోలు నగర పంచాయతీతోపాటు తాటిపర్తి, చేబ్రోలు, చెందుర్తి, దుర్గాడ, కొత్తపల్లి మండలంలోని వాకతిప్ప ఉప్పాడ, కొత్తపల్లి గ్రామాల్లో పర్యటించి చేనేత సొసైటీలు, వాటికి చెందిన స్థలాలు, కార్మికుల స్థితిగతులు, మగ్గాలను పరిశీలించారు. ఈ నివేదికను కేంద్రానికి పంపుతామని అధికారులు చెప్పారు.

రూ.4లక్షల విలువైన డైమండ్ లాకెట్ అప్పగింత

ఆత్రేయపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రూ.4లక్షలు విలువైన డైమండ్ లాకెట్‌ను పోగొట్టుకున్న బాధితురాలికి దొరికిన మహిళ అప్పగించి ఔదార్యాన్ని చాటుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలానికి చెందిన టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కొవ్వూరి శ్రీనివాస రెడ్డి తన భార్యతో ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయానికి కార్తీక పౌర్ణమి బుధవారంరాత్రి స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చారు. ఆమె మెడలో రూ.4లక్షల విలువైన డైమండ్ లాకెట్ గుడిలో జారిపడిపోయింది. ఈ విషయం పక్కనే ఉన్న ర్యాలి అయ్యప్పస్వామి ఆలయంలో స్వాములకు తెలియడంతో స్థానిక గ్రూపులలో బాధితురాలు పోగొట్టుకున్న విషయాన్ని పోస్ట్ చేశారు. అదే గ్రామానికి చెందిన ఇండుగుల కృష్ణవేణికి ఈ లాకెట్ దొరకడంతో అయ్యప్పభక్తులకు అందజేశారు. స్వాములందరూ లాకెట్ పోగొట్టుకున్న బాధితురాలు ఇంటికి వెళ్లి అప్పగించారు. వస్తువు దొరికిన కృష్ణవేణిని అందరూ అభినందించి నగదు బహుమతిని అందజేశారు.



పోగొట్టుకున్న బంగారు లాకెట్‌ను అప్పగించిన కృష్ణవేణికి నగదు పురస్కారం అందజేస్తున్న దృశ్యం

ఇసుక స్టాక్ పాయింట్ల తనిఖీ

- రికార్డులు పరిశీలించిన మైనింగ్ ఏడీ

ఎటపాక, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం గుండాల జాతీయ రహదారి సమీపంలో ఉన్న రెండు ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్లను గురువారంజిల్లా మైనింగ్ ఏడీ ఆనంద్ తనిఖీ చేశారు. ఇసుక అమ్మకాలు నిర్వహిస్తున్న స్టాక్ పాయింట్-1లో స్టాక్ రికార్డును పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత ఇసుక అమ్మకాలు చేశారు..? ఎంత ఇసుక నిల్వ ఉందనే దానిని పరిశీలించారు. గృహఅవసరాలకు వినియోగించు లబ్ధిదారులకు ఆధార్ స్థానికతలో అమ్మకాలు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ లో ఇసుక కొనుగోలు చేయకుండా, అనుమతులు లేకుండా స్టాక్ పాయింట్ వద్దకు వాహనాలను రానీయవద్దని తెలిపారు. తెలంగాణ రిజిస్ట్రేషన్‌తో ఉన్న వాహనాలకు ఇసుక లోడ్ చేయవద్దని, అలాంటి వాహనాలను స్టాక్‌పాయింట్ వద్దకు అనుమతించవద్దని సూచించారు. అనంతరం రాయనపేట, కన్నాయిగూడెం గ్రామాల్లో గోదావరినదీ ప్రాంతాలను పరిశీలించారు. తహసీల్దార్ కారం సుబ్బారావు, ఎంపీడీవో నాగమణి, తదితరులు ఉన్నారు.



స్టాక్ పాయింట్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న మైనింగ్ ఏడీ

పెరికివలస ప్రత్యేక పంచాయతీ

ఏర్పాటుకు గ్రామసభ

- నూతన పంచాయతీలకు తీర్మానం

వై.రామవరం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలోని ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు కోసం మండలంలోని చింతలపూడి పంచాయతీ పెరికివలస గ్రామంలో గురువారం ఎంపీడీవో బాపన్నదొర గ్రామసభ నిర్వహించారు. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతం గుర్తేడును ప్రత్యేక మండలంగా చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినందున నూతనంగా ఏర్పాటయ్యే గుర్తేడు మండలంలో 12 గ్రామాలతో చింతలపూడి పంచాయతీలోని పెరికివలస, పుట్టగండి, రచ్చవలస, దుమ్మదారవాడ, చింతవలస, కుంకుమామిడి బంద, కత్తిరాళ్ళు, పంచదారలంక, సీతలంక, నీలిపొలం, జమ్మనవీధి, దుమ్మనగడ్డ గ్రామాలతో నూతన పంచాయతీకి తీర్మానం చేశారు. ఎంపీపీ ఆనందరావు, వైస్ ఎంపీపీ జోగిరెడ్డి, స ర్పంచ్ పల్లాల సన్యాసమ్మ, ఉపసర్పంచ్ పల్లాల రాజుగోపాల్‌రెడ్డి, గుర్తేడు సర్పంచ్ దుష్యంతుడు, హౌసింగ్‌శాఖ నాగార్జున, ఉపాధి ఏపీవో స్వామి, వెలుగు ఏపీఎం ఆదినారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.





పత్యేక పంచాయతీ గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర, కొత్త పంచాయతీగా పెరికివలస పేరు అరిటాకుపై రాసిన గిరిజనులు



రక్తపు మడుగులో మృతుడు వడిశెల అప్పారావు (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

తనయుడి చేతిలో తండ్రి హతం

- చెల్లెలి వివాహంపై వివాదం
- కూరగాయల చాకుతో

గొంతు కోసి హత్య

రాజానగరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చెల్లెలి వివాహ విషయమై తండ్రీకొడుకుల మధ్య తలెత్తిన ఘర్షణ తండ్రి వడిశెల అప్పారావు(47))కుమారుడు సాయికుమార్ చేతిలో హతమైన సంఘటన తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజమహేంద్రవరంరూరల్ మండలం తొర్రేడు గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. ఇందుకు సంబంధించి సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ గురువారం రాత్రి విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న అప్పారావు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండో కుమార్తె ప్రశాంతికి అప్పారావు ధవళేశ్వరానికి చెందిన వ్యక్తితో పెళ్లి సంబంధం తీసుకొచ్చాడు. ఆ వ్యక్తితో ప్రశాంతి దగ్గరైంది. అయితే పెళ్లి కొడుకు తరుపు వారు కట్నం ఎక్కువ అడుగుతుండడంతో ప్రశాంతికి చూసిన పెండ్లి సంబంధం చేయడానికి తన దగ్గర అంత డబ్బు లేదు. ఈ మధ్యనే ఇళ్లు కట్టి కొద్దిగా అప్పుల్లో ఉన్నానని, మరో సంబంధం చూద్దామని భార్య, కుటుంబ సభ్యులతో కొద్ది రోజులుగా చెబుతూ వస్తున్నాడు. ఈ లోపులోనే ఇరు కుటుంబాల వారు దగ్గరయ్యారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ప్రశాంతి ఇంటికి ఆలస్యంగా రావడంతో తండ్రి దూషిస్తూ మాట్లాడాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న తండ్రిని కొడుకు సాయికుమార్ అడ్డుకున్నాడు. దీంతో గొడవ పెద్దదై తండ్రిని గెంటివేయడంతో అతడి తల గోడకు బలంగా తగులుకుని కింద పడిపోయాడు. ఆ సమయంలో భార్య, ప్రశాంతి గట్టిగా కేకలేశారు. దీంతో సాయికుమార్ వారిద్దరినీ పక్కనున్న గదిలోకి నెట్టి తలుపు గొళ్లెపెట్టి ఇంట్లోని కాయగూరలు కోసే చాకుతో తండ్రి పీక కోసేశాడు. అప్పారావు రక్తపు మడుగులో పడి కొట్టుమిట్టాడుతుండగా సాయికుమార్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈవిషయాన్ని ప్రశాంతి సమీపంలో ఉంటున్న మేనత్త బి.సీతకు ఫోన్ లో సమాచారం అందించింది. హుటాహుటిన సీత అప్పారావు ఇంటికి వెళ్లి చూసే అప్పారావు మృతిచెంది ఉన్నట్టు గుర్తించింది. ఈ మేరకు సీత ఇచ్చిన ఫిర్యాదుపై సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైవేపై కారు దగ్ధం

- పరుగులు తీసిన వాహనదారులు

తునిరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా 16వ నెంబరు జాతీయ రహదారి తునిరూరల్ వి.కొత్తూరు వద్ద కదులుతున్న కారులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కారు జాతీయ రహదారి మీదుగా పాయకరావుపేట వైపు వెళుతుండగా ఒక్కసారిగా కారులోంచి మంటలు చెలరేగాయి. ఇది గమనించిన డ్రైవర్ వాహనాన్ని వదిలి పరుగులు తీయడంతో నిమిషాల వ్యవధిలో మంటలు ఎగిసి పడ్డాయి. దీంతో జాతీయ రహదారి ఇరువైపులా ప్రయాణిస్తున్న వాహనదారులు భయాందోళన చెంది ఎక్కడ వాహనాలు అక్కడే ఆపేశారు.దీంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని వాహనం తగలపడి ఎగసిపడుతున్న మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఘటనపై తుని రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



జాతీయ రహదారిపై దగ్ధమవుతున్న కారు

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

జనసేనలో చేరికలు

రాజానగరం/దివాన్‌చెరువు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో రాధేయపాలెంలోని పలువురు వైసీపీ కార్యకర్తలు,నాయకులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కండువాలను మెడలో వేసి ఆహ్వానించారు. వైసీపీ సీనియర్ నాయకులు పడాల సుబ్బారెడ్డి, పడాల సాయిగోపాలరెడ్డి, పడాల లక్ష్మణ్‌రెడ్డి, బీసీ నాయకులు వాసంశెట్టి వీర్రాజు, వాసంశెట్టి సుబ్రహ్మణ్యం, వీవీవీ సత్యనారాయణ, పలువురు దళిత మహిళలు జనసేనలో చేరిన వారిలో ఉన్నారు. ఇదిలా ఉండగా కొత్త తుంగపాడుకు చెందిన రౌతుల కనకపోన కృష్ణార్జునకు వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధులు రూ.10 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే బత్తుల తెలిపారు. దీనికి సంబంధించిన ఎల్‌వోసీ పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకృష్ణపట్నం సర్పంచ్ కిమిడి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నాయకులను జనసేనలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

బాల్య వివాహాలు.. సామాజిక రుగ్మత

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు సామాజిక రుగ్మతని, వాటికి అడ్డుకట్ట వేయడం సమాజాంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శ్రీ కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాలలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణ, పోక్సో, ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టం, నల్సా మాదకద్రవ్యాల నిషేధ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. మాదక ద్రవ్యాలు కలిగి ఉండడం, వినియోగించడం, సరఫరా చేయడం, విక్రయించడం క్రిమినల్ నేరాలన్నారు. కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వాటి బారిన పడిన వాళ్లు స్వయంగా సహాయం కోరితే చేస్తామని, ఉచిత వైద్యం అందుతుందని, వాళ్లపై ఎలాంటి చట్టపరమైన చర్యలూ ఉండవని శ్రీలక్ష్మి పేర్కొన్నారు.

బౌద్ధ ఉత్సవానికి తరలి రండి!

రాజానగరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న తలపెట్టిన కోరుకొండ-శాపవరం బౌద్ధ వారసత్వ సాంస్కృతిక ఉత్సవానికి అధిక సంఖ్యలో తరలిరావాలని బౌద్ధ ఉత్సవ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈమేరకు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు విస్తృత ప్రచారం సాగిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఉత్సవానికి బీఆర్ అంబేడ్కర్ మునిమనువడు రాజారత్న అశోక్‌తో పాటు మంత్రి కందుల దుర్గేష్, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, దేశ విదేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు విచ్చేయనున్నట్టు చెప్పారు. బౌద్ధులు, బౌద్ధ, అంబేడ్కర్ అభిమానులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మేకల లక్ష్మీపతి, కవల ప్రశాంత్, చింతపల్లి ప్రవీణ్, ఏగి రమేష్, మేకల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కామన్ విద్య, ఉపాధి కోసం పోరాటం

పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కామన్ విద్య విధానం, ఉపాధి కోసం పీడీఎస్‌యూ నిరంతర పోరాటం సాగిస్తోందని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం విప్లవ విద్యార్థి అమరవీరుల వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో సంస్కరణల్లో మరింత వేగం పెంచారని, నూతన విద్యావిధానం పేరుతో విద్యారంగాన్ని పూర్తిగా కాషాయీకరణ చేస్తున్నారని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం, ఆకలిచావులు, ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలోనూ 84, 85, 117 వంటి జీవోలతో ప్రాథమిక పాఠశాలలు మూసివేసే కుట్రలు చేస్తున్నారని, 2.35 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా వాటి భర్తీ చేయడం లేదన్నారు. ఈ ప్రభుత్వాల విద్యార్థి వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు కె.భానుప్రసాద్ మాట్లాడారు. నగర కార్యదర్శి దినేష్‌బాబు,నాయకులు పాల్గొన్నారు.

డీఎంఈని కలిసిన జీజీహెచ్ సూపరింటెండెంట్



డీఎంఈ రఘునందనకు బొకే అందజేస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ జి.రఘునందనను రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. డాక్టర్ పీవీవీ రెండు రోజుల క్రితం జీజీహెచ్ నూతన సూపరింటెండెంట్‌గా ఉద్యోగబాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. జీజీహెచ్‌లో మెరుగైన వైద్యసేవలు, అభివృద్ధి, వైద్య సిబ్బంది బలోపేతం, ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం, మౌలిక సదుపాయాల కల్పన తదితర విషయాలను ఈ సందర్భంగా ఆయన డీఎంఈ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సమగ్ర వివరాలను డీఎంఈకి డాక్టర్ పీవీవీ సమర్పించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఎంఈని మర్యాదపూర్వకంగా కలిసి జీజీహెచ్ అభివృద్ధి, ఇతర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు సూపరింటెండెంట్ తెలిపారు.

వికాస్ ఫార్మసీ కళాశాలకు అటానమస్ హోదా

డైరెక్టర్ డాక్టర్ టీవీ నారాయణ

కోరుకొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగట్ల గ్రామంలో ఉన్న వికాస్ ఫార్మశీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ)స్వయం ప్రతిపత్తి(అటానమస్) హోదాను ప్రకటించిందని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, వికాస్ ఫార్మశీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ తన్నీరు వెంకటనారాయణ తెలిపారు. స్టాండ్ ఎలోన్ ప్రైవేట్ ఫార్మసీ కళాశాల అయిన వికాస్ కాలేజీలో అవలంబిస్తున్న అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలను పరిశీలించి ఈ హోదాను గురువారం అధికారికంగా ప్రకటించిందని చెప్పారు. ఒక ప్రైవేట్ ఫార్మసీ కళాశాలకు ఈ హోదా ప్రకటించడం దేశంలోనే ప్రప్రథమమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నారాయణతోపాటు కళాశాల చైర్మన్ తన్నీరు చిన సుబ్బారావు, సెక్రటరీ డాక్టర్ టి.భరత్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుమలత, సిబ్బందికి పలు రాష్ట్రాల నుంచి కళాశాలల యాజమాన్యాలు అభినందనలు తెలిపాయి.

అమరవీరుల సంస్మరణ సభలను జయప్రదం చేయండి

గోకవరం, నవంబరు6(ఆంధ్రజ్యోతి): విప్లవ అమరవీరుల సంస్మరణ సభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని శివరామపట్నంలో గురువారం వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ పీడిత జన విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేసి పోలీస్ బూటకపు ఎన్‌కౌంటర్లో అమరులైన చంద్ర పుల్లారెడ్డి, రంగవల్లి అక్క, జేసీఎస్, రియాజ్, దేవన్న వంటి ఎందరో వీరులు ఈ నెలలోనే మరణించారన్నారు. వారి పోరాట స్ఫూర్తితోనే ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ, సీలింగ్, దేవదాయ భూములపై పోరాటం చేసి పేదలకు పంచామన్నారు. ఈ నెల 11న జగ్గంపేట, 15న కాకినాడ, 22న రంపచోడవరం, 25న రాజమహేంద్రవరంలో జరిగే సంస్మరణ సభలను కార్మికులు, కర్షకులు, రైతుకూలీలు, విద్యార్థి మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుంచే అంజిబాబు, కె.సతీష్, కె.రామలింగేశ్వ రరావు, డొక్కులూరి సంగీత, జి.బాబు, పెద్ద, అర్జున్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల పరిశీలన

కడియం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరిగే ఆరు కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎక్జామినేషన్ ఎం.అమలాకుమారి గురువారం సందర్శించారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు వంటి విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఏడిద నాగేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఉద్యోగులు సత్యనారాయణ, సురేష్, హెచ్ఎంలు బి సుధ, బి.షీలా రాణి, పి.విశ్వనాథం, కె.జయలక్ష్మి పాల్గొన్నారు.

వెలుగుబంద హైస్కూల్‌కు కంప్యూటర్ వితరణ

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని గౌతమీ ఘాట్ రాజమండ్రి వర్తకులు, స్వచ్ఛంద సేవా సంస్థ చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు సభ్యులు వెలుగుబంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.అగ్నేశ్వరరావుకు సుమారు రూ.39 వేల విలువైన కంప్యూటర్‌ను గురువారం అందజేశారు. దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాలనాగు బలేష్‌గుప్తా, మండవిల్లి వెంకటరాజు, లక్కోజు వీరభద్రరావు, శిఘాకొల్లి సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

పాము కాటుతో వృద్ధుడి మృతి

బిక్కవోలు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊలపల్లి గ్రామంలో తాచు పాము కరిచి యాసాలపు అప్పలనాయుడు(64) అనే వృద్ధుడు మృతి చెందాడు. బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 5వ తేదీన అప్పలనాయుడు పెరటిలో శుభ్రం చేస్తుండగా తాచుపాము రెండు చోట్ల కరిచింది. దీంతో అతడిని బంధువులు అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ 5వ తేది రాత్రి మృతి చెందాడన్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సురక్షితమేనా

జాతీయ రహదారిని ఆనుకుని వారపుసంత



దివాన్‌చెరువులో హైవేని ఆనుకుని ఏర్పాటు చేసిన దుకాణాలు



- దివాన్‌చెరువులో ప్రతీ బుధవారం నిర్వహణ
- హైవేపై తరచూ ట్రాఫిక్‌జామ్
- పెరిగిన పశువుల సంచారం
- పొంచి ప్రమాదం

దివాన్‌చెరువు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా దివాన్‌చెరువులో జరుగుతున్న వారపుసంతను సురక్షితమైన వేరే ప్రదేశానికి మార్చవలసిన అవసరం ఏర్పడింది. దివాన్‌చెరువు గ్రామంలో ప్రస్తుతం ప్రతీ బుధవారం వారపు సంత జరుగుతోంది. జాతీయరహదారిని ఆనుకుని శ్రీలక్ష్మీగణపతి ఆలయం వద్ద ఈ సంత నిర్వహిస్తున్నారు. ఇక్కడికి రాజానగరం, రంగంపేట మండలాలకు చెందిన దాదాపు 50 మంది వ్యాపారులు వచ్చి కూరగాయలు, ఎండుమిర్చి, మసాలా దినుసులు, ఎండు చేపలు విక్రయిస్తుంటారు. స్థానికులతో బాటు సమీప గ్రామాల ప్రజలు వచ్చి తమకు అవసరమైన వాటిని కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడి వరకూ బాగానే ఉన్నా.. వ్యాపారులు జాతీయ రహదారికి అత్యంత సమీపంలోనే దుకాణాలను ఏర్పాటు చేస్తుండడంతో వినియోగదారులు తమ వాహనాలను రహదారి అంచున నిలిపి కొనుగోళ్లు సాగిస్తున్నారు. ఇటీవల ఈ రహదారిపై ట్రాఫిక్ జామ్ జరగడం పరిపాటిగా మారింది. అటువంటి సందర్భాల్లో హైవే అంచు దిగి ముందుకు వెళ్లేందుకు ద్విచక్రవాహనదారులు చేసే ప్రయత్నాలకు ఆటంకం ఏర్పడుతోంది. ఇక ఆవులు, గేదేలు ఈ రహదారిపైనే విచ్చలవిడిగా తిరుగుతూ సంచార వాహన నిరోధకాలుగా ఉంటున్నాయి. ఒక్కొక్కసారి అవి జాతీయరహదారిపై అటు, ఇటు పరుగులు పెడుతుంటాయి. ఆ సమయంలో హైవేపై వేగంగా ప్రయాణించే వాహనాలు అదుపుతప్పితే ఎటువంటి నష్టం ఏర్పడుతుందోనని కొందరు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దివాన్‌చెరువుకు ప్రభుత్వం ఫ్లైఓవర్‌ను మంజూరు చేసింది. ఫైవంతెన నిర్మాణంతో ప్రస్తుతం వారపుసంత జరిగే ఆలయం సమీపం వరకూ సర్వీసు రోడ్‌లు వస్తాయని తెలుస్తోంది. ఈ కారణాల దృష్ట్యా వారపుసంతను వేరే ప్రదేశానికి మార్చవలసి ఉంది. సంతను నిర్వహించుకునేందుకు అటు వ్యాపారులకు ఇటు వినియోగదారులకు అనువైన స్థలాన్ని పంచాయతీ ఎంపిక చేయడంతో బాటు వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే పంచాయతీకి అదనపు ఆదాయం కుడా లభించే అవకాశం ఉంటుందని పలువురు అంటున్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

హౌసింగ్, కార్పొరేషన్ అధికారులతో సమీక్షలో కమిషనర్ రాహుల్‌మీనా



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ రాహుల్‌మీనా

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గృహాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా ఆదేశించారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన వెలుగుబంద, కానవరం లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్, కార్పొరేషన్ అధికారులతో సమీక్ష చేశారు. ఇళ్ల నిర్మాణాలపై ప్రతీ వారం లక్ష్యాన్ని నిర్దేశించుకుని తప్పనిసరిగా స్టేజ్ కన్వర్షన్ జరిగేలా చూడాలన్నారు. సొంత స్థలంలో ఇళ్లు కట్టుకునే వారితో ఎప్పటికప్పుడు మాట్లాడి చైతన్య పరచాలని సచివాలయం ఎమినిటీ సెక్రటరీలకు సూచించారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించకపోతే దానిని సహేతుకమైన కారణాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0లో భాగంగా సొంత స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి వారం రోజుల్లో జియోట్యాగింగ్ పూర్తి చేయాలని ఎమినిటీ సెక్రటరీలను ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, హౌసింగ్ ఈఈ రాజ్‌కుమార్, డీఈ విఘ్నేష్ కన్నా, కార్పొరేషన్ ఈఈ మదర్షాఆలీ, ఏఈ అవినాష్, ఎమినిటీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయాలు తీసుకోండి

స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ తనిఖీ చేశారు. టోకెన్ కౌంటర్, డైనింగ్ హాలు, చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా.. ప్రజలకు రుచికరమైన శుభ్రతతో కూడిన ఆహారాన్ని అందించాలని, ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆహారం కోసం వచ్చిన వారితో కమిషనర్ మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను అన్న క్యాంటీన్‌లో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలన్నారు. క్యాంటీన్లను నోడల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, అక్కడ భోజనాలు చేస్తున్న వారి అభిప్రాయాలు కచ్చితంగా తీసుకోవాలని చెప్పారు. ఈ తనిఖీలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తారకరామానగర్ రూపురేఖలు మారుస్తాం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు.. సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైన తారకరామానగర్‌ను కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పూర్తిగా అభివృద్ధి చేసి రూపురేఖలు మార్చబోతున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. గురువారం నగరంలోని 1వ వార్డుల తారకరామనగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఎమ్మెల్సీ సోము వీర్రాజులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం రూ.65 లక్షలతో చేపట్టిన పనులతో పాటు రూ.3.80 కోట్లతో పనులు, రెండు నెలల్లో మొదలుపెడతామన్నారు. ఎమ్మెల్సీ వీర్రాజు ప్రతిపాదించిన రూ.2.50 కోట్లతో డ్రైన్ పనులు కూడా పూర్తయ్యాక రూ.3.50 కోట్లతో డ్రైన్ల నిర్మించాలన్నారు. ఆరోగ్య రాజమహేంద్రవరంలో భాగంగా 30 పార్కులు, అలాగే 1వ డివిజన్‌లో 4 పార్కులు అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు పన్నులు కడుతున్నా వైసీపీ వాళ్లు ఈ నగర్‌ను అభివృద్ధి చేయలేదన్నారు.

ఫ్లైఓవర్ తెచ్చింది భరత్ కాదు: సోము

మోరంపూడి ఫ్లైఓవర్ తెచ్చింది మాజీ ఎంపీ భరత్‌రామ్ కాదని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. గత ఎంపీ మురళీమోహన్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కేంద్రమంత్రి నితిన్ గడ్కరిని ఒప్పించి మంజూరూ చేయించుకున్నారని గుర్తుచేశారు. తారకరామానగర్‌లో డ్రైనేజీలు, రోడ్లపై గతంలో ఎంపీ భరత్‌కు చెబితే పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సమస్యలను ఎమ్మెల్యే వాసు దృష్టికి తీసుకొస్తే ఆయన రెండుసార్లు వచ్చి పనులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో నాయకులు పిక్కి నాగేంద్ర, శ్రీను, ఎండోమెంట్ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

హితకారిణి సమాజం ప్రమాణస్వీకారం

కందుకూరి వీశలింగం పంతులు స్థాపించిన హితకారిణి సమాజం ట్రస్ట్ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం గురువారం రాత్రి ఎస్‌కేవీటి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జరిగింది. తొలుత వీరేశలింగం పంతులు విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం హితకారిణి సమాజం చైర్మన్‌గా డాక్టర్ యాళ్ల ప్రదీప్ సుకుమార్, బోర్డు డైరెక్టర్లు ఏవీవీ సత్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, మేడపాటి సాయిభాగ్యలక్ష్మి, సీహెచ్ఏఎస్ నాగవల్లి, కిలారి లక్ష్మి, కె.లలితారాణి, జి.శ్యామ్‌సుందర్, టి.శేషరత్నకుమారి ప్రమాణ స్వీకారం చేశాఉ. దీనికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ మేయర్ వీరరాఘవమ్మ, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు విచ్చేశారు. నూతన కమిటీ హితకారిణి ఆస్తులను పరిరక్షించాలని, కందుకూరి విద్యాసంస్థలను కాపాడి సౌకర్యాలు మెరుగుపర్చాలని ఎమ్మెల్యే వాసు అన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్లు చల్లా శంకరరావు, కోళ్ల బాబు, జనసేన ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ, కాశి నవీన్‌కుమార్, వై.శ్రీను, గంట స్వరూప, యాళ్ల వెంకటరావు, నక్కా చిట్టిబాబు, కొయ్యల రమణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జీవకారుణ్య మండలి

గౌతమి జీవకారుణ్య సంఘం నూతన పాలక మండలి చైర్మన్‌గా ఎన్నికైన వర్రే శ్రీనివాసరావు, సభ్యులు స్థానిక తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదిరెడ్డి వాసును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాలక మండలికి ఆయన అభినందనలు తెలిపారు.

రబీకి పుష్కలంగా యూరియా, ఎరువులు

తుఫాన్‌కు పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం: ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



ఇళ్లపల్లిలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రబీ పంట కోసం యూరియా, ఎరువులు పుష్కలంగా ఉన్నాయని, అలాగే మొంథా తుఫాన్‌కు నష్టపోయిన రైతులను అన్ని విధాల ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం అనపర్తిలోని కూటమి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాన్ సమయంలో ప్రాణనష్టం వాటిల్లకుండా నిరోధించగలిగామని, దురదృష్టవశాత్తూ పంట నష్టం వాటిల్లిందన్నారు. జిల్లాలో 17,100 ఎక్టార్లలో వరి, మినుము పంటలకు నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా వేసినట్టు చెప్పారు. నష్టపోయిన పంట నమోదు పూర్తయిన వెంటనే పరిహారం ప్రకటిస్తారన్నారు. రబీ సీజన్‌లో యూరియా, ఎరు వులకు కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సమావేశంలో అనపర్తి, బిక్కవోలు, కొప్పవరం సొసైటీల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల చిట్టిబాబు చౌదరి, సబ్బెళ్ల రామారెడ్డి పాల్గొన్నారు. కాగా పొలమూరులోని దత్తనాగ సాయి ఆనందాశ్రమంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ వ్యవస్థాపకుడు సత్తి దేవదానరెడ్డి విమల దంపతులు ఆహ్వా నం పలికారు. వీరి వెంట ద్వారంపూడి ఈశ్వరరెడ్డి, కర్రి జీఎస్‌రెడ్డి తదితరులున్నారు.

ఇళ్లపల్లిలో పశువైద్య శిబిరం

బిక్కవోలు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇళ్లపల్లిలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల మినీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. పెయ్యదూడల ఉత్పత్తి పథకంలో చేరి పాల ఉత్పత్తులను పెంచాలని రైతులకు సూచించారు. శిబిరంలో 65 పశువులకు గర్భకోశ చికిత్సలు, చూడి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నేతలు తనుకు శ్రీధర్, పంచికట్ల నాగరాజు, కానాటి అప్పలస్వామి, కన్నీరు రాఘవ, రాజమహేంద్రవరం డీడీ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.కాంతారావు, ఏడీఏ వై.శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

పన్నుల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి: గోరంట్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో పెద్ద మొత్తంలో ఉన్న పన్నుల బకాయిల వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి సూచించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఎంపీడీవో కె.రమేష్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా పన్నుల వసూళ్లు, బకాయిల వివరాలు, ఖర్చులు ఇతర అంశాలపై సమీక్షించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను విధిగా తనిఖీ చేయాలని, కార్మికులకు ప్రతి నెలా జీతాలు సక్రమంగా అందించాలని చెప్పారు. ఇప్పటి వరకు జరిగిన సీసీ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి పనులు, వాటికి చెల్లించిన బిల్లులపై ఆరా తీశారు. జరగాల్సిన పనులకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. తాగునీటి సరఫరాలో సమస్యలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలో వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

రాయవరం మున్సబు వర్ధంతి

రంగంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రంగంపేటలోని వెంకటేశ్వర కర్రల మిల్లు ఆవరణలో గురువారం రాజకీయ విశ్లేషకుడు అడబాల మరిడియ్య ఆధ్వర్యంలో ఉండవిల్లి సత్యనారాయణమూర్తి(రాయవరం మున్సబు) 36వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మడికి చిన్నోడు,వెలమర్తి త్రిమూర్తులు, వెంకటేశులు, ఆలపు అబ్బులు, వీరబాబు, కమ్మరి రాము తదితరులు పాల్గొన్నారు.

జి.దొంతమూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం

రంగంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.దొంతమూరు గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అనపర్తి ఆత్మ కమిటీ చైర్మన్ వెలుగుబంటి సత్తిబాబు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు ఉద్దండ్రావు శ్రీనివాసరావు, గిరజాల సత్తిబాబు, సింగంపల్లి సొసైటీ సభ్యుడు దుప్పలపూడి రాజేష్ పాల్గొన్నారు.

తెలుగు వర్శిటీ వీసీని కలిసిన సాహితీవేత్తలు

కడియం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ నేతృత్వంలో తెలుగు సాహితీవేత్తలు బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి డి.మునిరత్నంనాయుడును గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇకపై విశ్వవిద్యాలయంలో నెలకోసారి భాషా సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తామని, పూర్వవైభవం తీసుకు రావడానికి జరిగే కృషిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది తోరాటి వసంతరావు, దేవవరపు నీలకంఠరావు, చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన

కోరుకొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కోరుకొండలోని సాయిబాబా ఆలయం వద్ద విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన రూ.1.50 లక్షల విరాళం అందజేశారు. అధిక సంఖ్యలో భక్తుల ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, సిబ్బది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తొలుత సాయిబాబాను భక్తులు దర్శించుకు ని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



కోపంలో.. కన్న తండ్రినే చంపేశాడు!

సోదరి పెళ్లి విషయమై ఘర్షణ

తన కోపమే తన శత్రువు.. తన శాంతమే తనకు రక్ష.. ఈ మాట అక్షరసత్యం.. అప్పటి వరకూ ఆ కుటుంబంలో అంతా ప్రశాంతం.. అమ్మా నాన్నా.. ఇద్దరు అక్కచెల్లెళ్లు .. ఒక తమ్ముడు.. ఇటీవలే ఇల్లూ కట్టుకున్నారు.. అంతా ఆనందమే.. గురువారం రాత్రి ఒక్కసారిగా ఆ ఆనందం అంతా ఆవిరైపోయింది.. కొద్ది రోజులుగా రెండో కుమార్తె పెళ్లి విషయంలో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి.. గురువారం రాత్రి గొడవ జరిగింది.. ఇదంతా కుమారుడు చూస్తూనే ఉన్నాడు.. తట్టుకోలేకపోయాడు.. కోపంలో తండ్రిని ఒక గెంటు గెంటాడు.. అంతే గోడకు తగిలి తండ్రి కింద పడిపోయాడు.. అదే కోపంలో కూరగాయలు కోసే చాకుతో తండ్రి గొంతు కోసేశాడు.. చిన్నతనం నుంచి పెంచి పెద్ద చేసిన తండ్రిని కోపం దూరం చేసింది.. అతను జైలు పాలయ్యేలా చేసింది.. అతని కోపం అతని పాలిట శత్రువుగా మారింది.

9

అన్నన్నా చూస్తూ ఊరుకుంటానా!



ఈయనెవరో గుర్తుపట్టారా.. కమిషనర్ రాహుల్ మీనా.. ఎక్కడైనా సమస్య ఉందని ఫిర్యాదు వస్తే చాలు వాలిపోతున్నారు.. పరిష్కరించేలా ఆదేశాలిస్తున్నారు.. ఇది ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్.. నిత్యం రద్దీగానే ఉంటుంది.. ఆ కేంద్రంపై ఏం ఫిర్యాదు వచ్చిందో ఏమిటో కానీ.. గురువారం మధ్యాహ్నం భోజన సమయంలో ఆకస్మికంగా వచ్చారు.. ఇలా తనిఖీ చేశారు. ఆహారంలో నాణ్యత తగ్గితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.. ప్రజలతో మాట్లాడారు.. ప్రజాభిప్రాయం తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. - రాజమహేంద్రవరం సిటీ

తెలుగు వర్సిటీకి పూర్వ వైభవం తెస్తా : వీసీ



కడియం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి భాషా సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తామని విశ్వవిద్యాలయం ఉపకులపతి డి మునిరత్నం నాయుడు పేర్కొన్నారు. కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ నేతృత్వంలో తెలుగు సాహితీవేత్తలు బొమ్మూరు తెలుగు వర్శిటీలో ఆయనని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపకులపతి మునిరత్నంనాయుడు మాట్లాడుతూ ఇకపై విశ్వవిద్యాలయంలో నెలకోసారి భాషా సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తామని పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు.



తూర్పోదయం!

సరికొత్తగా తూర్పుగోదావరి..?

తూర్పుగోదావరి అతి పెద్ద జిల్లాగా ఆవిర్భవించనుంది.. జిల్లాకు కొత్త స్వరూపం రానుంది.. సరిహద్దులు మారనున్నాయి. రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటికే పశ్చిమలో ఉన్న మూడు నియోజక వర్గాలు విలీనం అయ్యాయి.మరో రెండు నియోజకవర్గాలు తూర్పున విలీనమయ్యే అవ కాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తూర్పున నియోజ కవర్గాల సంఖ్య 9కి చేరనుంది. మంత్రుల కమిటీ సూచనలు అమలైతే అతి పెద్ద జిల్లాగానూ ఆవిర్భవించనుంది.

- మారనున్న జిల్లా స్వరూపం
- మండపేట నియోజకవర్గం విలీనం
- రంపచోడవరం విలీనమా.. ప్రత్యేక అథార్టీనా
- ఆ రెండూ విలీనమైతేనే 9 నియోజకవర్గాలు
- 10న కేబినెట్‌లో నిర్ణయం
- డిసెంబర్ 31కి ముందే ప్రక్రియ పూర్తి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలో మండపేట నియోజకవర్గం, ఏజెన్సీ ప్రాంతమైన రంపచోడవరం నియోజకవర్గం కలిసే అవకాశాలపై మంత్రుల కమిటీ చర్చించిన సంగతి తెలిసిందే. ఈనెల 10వ తేదీన అమరావతిలో జరిగే మంత్రివర్గ సమావేశంలో వీటిపై పూర్తి స్పష్టత రానుంది. మొత్తం ప్రక్రియ ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ లోపు పూర్తి కావాల్సి ఉంది. 2026 జనవరిలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ ఆరంభం కానుంది. ఈలోపే జిల్లాల పునర్విభజన ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. ఈ నేప థ్యంలో 10వ తేదీన కేబినెట్ మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్న తర్వాత జిల్లాల పునర్విభజన ప్రకటన వెలువడే అవకాశముంది. దాని తర్వాతే గెజిట్ జారీ చేస్తారు.

2022లో పునర్విభజన

2022లో జిల్లాల పునర్విభజన జరిగిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వం హడావుడిగా పార్లమెంట్ పరిధిని జిల్లాగా నిర్ణయిస్తూ జిల్లాల పునర్విభజన చేసేసింది. అప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను మూడు ముక్కలు చేసి తూర్పుగోదావరి, కాకినాడ, డా.బీఆర్ అంబేద్కర్ జిల్లాలుగా విభజించింది. కొత్త తూర్పుగోదావరి జిల్లాగా రాజమండ్రి, కొవ్వూరు డివిజన్లను కలిపి ఏర్పాటు చేసింది. నాడు మండపేట నియోజకవర్గాన్ని అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కలపడాన్ని అక్కడ ప్రజలు, ప్రజాప్రతినిధులు వ్యతిరేకించారు. ఎందుకంటే బొమ్మూరులో ఉన్న జిల్లా కలెక్టరేట్ కొద్ది దూరంలో ఉంటుంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఆలోచించి మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపడానికి నిర్ణయించింది. దీంతో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు మూడు తూర్పుగోదావరి జిల్లాలో కలవనున్నాయి. మండపేట, రంపచోడవరం నియోజకవర్గాలు విలీనమైతే 9 నియోజకవర్గాలతో తూర్పుగోదావరి పెద్ద జిల్లా కానుంది. మండపేట నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రంపచోడవరం విషయంలో 10న క్లారిటీ రానుంది.

కోనసీమ వద్దు.. కాకినాడ ముద్దు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రపురంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని అఖిలపక్ష జేఏసీ డిమాండ్‌కు మద్దతుగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఇచ్చిన పిలుపుమేరకు గురువారం బంద్ పాటించారు. వర్తక వాణిజ్య, విద్యా సంస్థలు, బార్ అసోసియేషన్ స్వచ్ఛందంగా బంద్ పాటించారు. రాజగోపాల్ సెంటర్ నుంచి జీవిత బీమా కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. కోనసీమ వద్దు, కాకినాడ ముద్దు అంటూ నినాదాలు చేశారు. 52 పంచాయతీలు, పురపాలక సంఘం రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడలో కలపాలని తీర్మానించాయని జేఏసీ నాయకులు అన్నారు. జేఏసీ కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో కన్వీనర్ బి.సిద్దు, చాంబర్ నాయకులు పసుపులేటి సత్తిబాబు, బార్ అధ్యక్షుడు వుండవిల్లి గోపాలరావు, గాదంశెట్టి శ్రీధర్, గొల్లపల్లి కృష్ణ, కౌన్సిలరు అంకం శ్రీను, టీడీపీ నాయకులు నారపురెడ్డి బలరామ్ తదితరులు పాల్గొన్నారు.



ఇలా చేయండి : రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడలో విలీనం చేయాలని ప్రదర్శన

రంపచోడవరం ఇలా...

ఏజెన్సీ పూర్వపు తూర్పుగోదావరి జిల్లాలోనే ఉండేది.2022లో జిల్లాల పునర్విభజన తర్వాత అల్లూరి సీతారామరాజు పేరిట ఏర్పడిన పాడేరు జిల్లాలోని రంపచోడవరం నియోజకవర్గంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతాన్ని కలిపారు. 200 కిలోమీటర్ల దూరంలోని పాడేరు కలెక్టరేట్ పరిధిలోకి తేవడంతో చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రంపచోడవరం, చింతూరు డివిజన్లతోపాటు పోలవరం ముంపు ప్రాంతాలను కలిపి ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని కొందరు లేదా, తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని కొందరు ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. దీంతో మంత్రుల ఉప కమిటీ ఇక్కడి పరిస్థితులపై సమీక్షించింది. పోలవరం ముంపు మండలాలు, ఏజెన్సీని ప్రత్యేక అథార్టీగా ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే ప్రతిపాదన చేశారు. రంపచోడవరం నియోజకవర్గాన్ని తూర్పులో విలీనం చేసే అంశంపైనా చర్చించారు. ఏలూరు జిల్లాలో ఉన్న పోలవరం ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

మండలాల మాటేమిటి..

2022లో జిల్లాల పునర్విభజన లోక్‌సభ స్థానం యూనిట్‌గా ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించినా చాలాచోట్ల ఈ నిబంధన ఉల్లంఘించింది. దీంతో కొన్ని మండలాల పరిధిలో సమస్యలు నెలకొన్నాయి. గోపాలపురం నియోజకవర్గం పరిధిలో గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాలు తూర్పుగోదావరి జిల్లాలో.. చిన వెంకన్న ఆలయం ఉన్న ద్వారకా తిరుమల ఏలూరు జిల్లాలో కలిపారు. కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం పరిధిలోని గోకవరం మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలిపారు. అనపర్తి నియోజకవర్గంలోని పెదపూడిని కాకినాడ జిల్లాలో కలిపారు. ఆయా మండలాల ప్రజల సమస్యలు పెరిగాయి.. ఎమ్మెల్యేలు, ఎంపీ వంటి ప్రజాప్రతినిధులు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారు.. కలెక్టర్, ఆర్డీవో, ఇతర అధికారులు వేరే జిల్లాలకు చెందిన వారు. తూర్పు కలెక్టరేట్‌తో వీరి సం బంధాలు లేకుండాపోయాయి. వీటిపై ప్రస్తుత ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.



ఎన్నికల అధికారి వీసీలో కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘాస్వరూప్, డీఆర్వో సీతారామ్మూర్తి

ఇక సచివాలయాలు కాదు..

విజన్ యూనిట్లు

- నేటి నుంచి మనమిత్ర క్యాంపెయిన్
- కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయాలను ప్రభుత్వం విజన్ యూనిట్లుగా మార్పు చేసిందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇకపై సచివాలయాలు అనే పేరు తొలగించి విజన్ యూనిట్లుగా పిలుస్తారన్నారు. జిల్లాలో శుక్రవారం నుంచి వాట్సప్ ఆధారిత సేవలు 'మన మిత్ర'పై క్యాంపెయిన్‌ని ప్రారంభిస్తున్నామని తెలిపారు.ఇకపై ప్రతి శుక్రవారం గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వాట్సప్ సేవల డెమో, క్యూ ఆర్ కోడ్ గురించి కరపత్రాలను అందజేసి అవగాహన కల్పిస్తారన్నారు. ఈ క్యాంపెయిన్ ఉన్న రోజున అత్యవసర వైద్య కారణాలు మినహా సెలవు మంజూరు చేయడం జరగదన్నారు. డీఎల్‌డీవోలు ప్రతి శనివారం నివేదిక సమర్పించాలన్నారు.

పోషకాహారం లోపం రానివ్వొద్దు..

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పిల్లల పోషకాహార స్థితిని క్రమం తప్పకుండా పరిశీలించి, ప్రమాదస్థితిలో ఉన్న చిన్నారులను వెంటనే గుర్తించాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. తక్కువ బరువు, తగిన ఎత్తు లేకపోవడం, బలహీనస్థితి తదితర సమస్యలున్న చిన్నారులపై అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా శిశు సంరక్షణ విభాగం, శిశు సంరక్షణ సంస్థల పనితీరుపై కలెక్టర్ సమీక్షించారు. పోషకాహారలోపం ఉన్న పిల్లలకు అదనపు పోషకాహారం, వైద్య పరీక్షలు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన సమయంలో టీవీలు ఆన్ చేయరాదన్నారు. 104 వాహనాలు వచ్చినపుడు అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి టి.శ్రీదేవి, లేడీ ఆర్గనైజర్ ఏ.రాజ్యలక్ష్మి, ఇన్‌ఛార్జి జిల్లా శిశు సంరక్షణ అధికారి ఆర్.అనంత ప్రదీప్ పాల్గొన్నారు.

ఓట్ల ప్రక్రియ వేగవంతం

రాజమహేంద్రవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఓటరు నమోదు ప్రక్రియను వేగ వంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఏపీ ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ రాష్ట్రంలోని జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వెలగపూడి నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో గురువారం సమీక్షించారు. జిల్లాలో ఫారం 6,7,8కి సంబంధించి 20,344 దరఖాస్తులు రాగా 20,114 పరిష్కరించామన్నారు. 230 ఫారాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు.బీఎల్వో, ఏఈఆర్వో, ఈఆర్వో స్థాయిల్లో తుది పరిశీలన జరుగుతుందని, చిరునామా ధ్రువీకరణ,పలు పత్రాల లోపం వంటి కారణాలతో కొంత ఆలస్యం అవుతోందన్నారు.వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.బుక్ ఏ కాల్ విత్ బీఎల్వో సేవకు సంబంధించి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 65 అభ్యర్థనలు స్వీకరించి 40 సమాధానాలు పంపగా 24 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లో అత్యధికంగా 14 పెండింగ్ అభ్యర్థనలు ఉన్నాయన్నారు.జేసీ వై.మేఘ స్వరూప్, డీఆర్వో టి.సీతారామమూర్తి పాల్గొన్నారు.



బిక్కవోలులో షష్టి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

26న బిక్కవోలులో షష్టి ఉత్సవాలు

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి షష్టి ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికారులకు సూచించారు.మండలంలోని అన్ని శాఖల అధికారులతో ఈ నెల 26న నిర్వహించే షష్టి ఉత్సవంపై గురువారం సమావేశం నిర్వహించారు.భక్తులకు అసౌకర్యం కలగకుండా దర్శనాలు కల్పించాలన్నారు. ఆలయం లోపల ఇరుకుగా ఉంటుంది కాబట్టి భద్రత కట్టుదిట్టంగా ఉండాలన్నారు.బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయ అభివృద్ధికి సేకరించిన రూ.కోటి విలువైన భూములను దేవదాయశాఖ పేరున రిజిస్ట్రేషన్ చేసిన దస్తావేజులు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి కమిటీ సభ్యులు అందజేశారు. ఆలయ అభివృద్ధికి రెండున్నర ఎకరాలు భూమినిస్తే దేవదాయశాఖ రూ.3.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు.రాజకీయాలకతీతంగా కమిటీ సభ్యులు భూములను సేకరించడం అభినందనీయమన్నారు. మరో 1.5 ఎకరాల భూమిని సేకరించే పనిలో ఉన్నారన్నారు.దస్తావేజులను జిల్లా దేవదాయశాఖాధికారి ఈవి.సుబ్బారావుకు ఎమ్మెల్యే అందజేశారు. షష్టి ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లి శ్రీనివాస రెడ్డి, ఆర్డీవో కె. కృష్ణనాయక్, డీఎస్పీ బి.విద్య, అనపర్తి సీఐ సుమంత్, తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్,ఈవో ఆకెళ్ల భాస్కర్, సర్పంచ్ సుమలత, కూటమి నేతలు పాల్గొన్నారు.

బైక్‌పై విన్యాసాలు చేస్తూ.. విద్యార్థులపై పడ్డారు!

- ఐదుగురు విద్యార్థులకు గాయాలు
- వేగేశ్వరపురంలో ఘటన
- ప్రైవేటు ఆసుపత్రికి తరలింపు

తాళ్లపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు యువకులు బైక్‌పై చేసిన విన్యాసాలు ఐదుగురు విద్యార్థులు పాలిట శాపంగా మారాయి. మండలంలోని వేగేశ్వ రపురం ఉన్నత పాఠశాల వద్ద గురువారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన కావూరి అబి, తాళ్లపూడికి చెందిన నక్కా అఖిల్ సుజికి జిక్సర్ బైక్‌పై అమ్మాయిలను చూస్తూ బైక్‌పై హడావుడి చేశారు. ఇదిలా ఉండగా ఆ సమయంలో బైక్ అదుపుతప్పి మరో బైక్‌పై పడడంతో ఇంటికి వెళ్లడానికి బస్టాండ్ సెంటరులో నిలుచున్న ఐదుగురు విద్యార్థులను బైక్ ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాల పాలైన విద్యార్థులు బోడపాటి నందిని, గండి శ్రీలక్ష్మి, మెల్లిమి పోసమ్మ, బోడపాటి ధరణి, ఎక్కిశెట్టి చైతన్యను చికిత్స నిమిత్తం స్థానికులు తాళ్లపూడిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు ప్రమాద సమాచారం అందిన వెంటనే అక్కడ ఉన్న బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఇద్దరు యువకులు పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం.



మూతపడెన్!

ఆరు నెలలుగా రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కేంద్రం మూత

- ఇద్దరు సిబ్బంది మధ్య గొడవలే కారణం
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- 6 నెలలుగా ఆగిన శిక్షణ
- అయోమయంలో తల్లిదండ్రులు
- భయంకరంగా మారిన పరిసరాలు
- శిక్షణకు తల్లిదండ్రుల డిమాండ్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రైల్వే స్కౌట్ అండ్ గైడ్స్ విషయంలో దక్షిణ మధ్య రైల్వే అధికారుల తీరు విస్మయానికి గురి చేస్తోంది. ఇద్దరు ఉద్యోగుల మధ్య వైరం చినికి చినికి పిల్లలకు శిక్షణ ఆగిపోయే వరకూ వెళ్లింది. ఈ నేపథ్యంలో ఆరు నెలల నుంచీ డెన్ (శిక్షణ ఇచ్చే ప్రదేశం)కి తాళాలు వేసి ఉన్నా పట్టించుకొనే అధికారి కానరావడం లేదు. ఈ గొడవల కారణంగా తర్ఫీదు తర్వాత సంగతి.. పిల్లల సమయం పాడవుతుందనే ఉద్దేశంతో ఆ తల్లిదండ్రులు శిక్షణను పక్కన పెట్టేశారు. ఎంతో విశిష్టత ఉన్న సంస్థ పట్టాలు తప్పడం.. చిన్న పాటి సమస్యను పరిష్కరించలేని అధికారుల నిర్లక్ష్యం విమర్శలకు తావిస్తోంది.

ఏం జరిగింది?

దక్షిణ మధ్య రైల్వేలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగానికి రాజమండ్రి రైల్వే స్టేషన్ తూర్పు వైపున డెన్‌కి రైల్వే ప్రదేశాన్ని కేటాయించింది. సుమారు 30 వరకూ సిమెంటు బెంచీలను ఏర్పాటు చేసింది. అయితే ఎప్పటి నుంచో శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్‌ని కాదని మూడేళ్ల కిందట వచ్చిన మరో వ్యక్తి అజమాయిషీ చేయడం మొదలుపెట్టాడు. గ్రూపు గొడవలు అతని వల్లనే మొదలయ్యాయని చెబుతున్నారు. ఈ గలాటాలో డెన్‌కి తాళం పడింది. ఇక్కడ శిక్షణ తీసుకునే వాళ్లకు ఒక వాట్సాప్ గ్రూపు ఉంది. అయితే గందరగోళం వల్ల ఆ గ్రూపు నుంచి చాలా మంది తొలగి పోయారు. ఇప్పుడు ఎందరున్నారనే విషయం కూడా అయోమయంగానే ఉందని చెప్పవచ్చు. చివరికి అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ కమిషనర్ కూడా రాజీనామా చేసి వెళ్లిపోవడంతో ఆయన కార్యా లయానికీ తాళం పడింది. గందరగోళానికి కారణమైన ఉద్యోగిని అధికారులు బదిలీ చేశారు. ఆపై డెన్‌ని పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో ఇక్కడ పరిసరాలు భయానకంగా తయారయ్యాయి. రాత్రి వేళ మాట అటుంచితే పగటి వేళ కూడా ఇక్కడ ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే బయటకు తెలియడం కష్టమనే చెప్పారు. ఈ డెన్ మూతబడిన సుమారు ఓ నెలకు ఒక వ్యక్తి ఇదే డెన్‌లోని ఓ చెట్టుకింద సిమెంటు బెంచీలో విగతజీవిగా మారాడు. 15 రోజుల తర్వాత ఈ దారుణం వెలుగుచూసింది. ఇంత అభద్రత ఉన్నా రైల్వే అధికారులు ఈ డెన్ విషయంలో ఈనాటికీ మేల్కొనలేదు. డెన్ మెయిన్ గేటుకు తాళం వేయడంతో మరో దారి అనధికారికంగా ఏర్పడింది.దీంతో అసాంఘిక కార్యకలాపాలు జరుగు తున్నాయి.అధికారులు స్పందించి స్కౌట్స్ శిక్షణ ఆరంభించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఐదేళ్ల నుంచి శిక్షణ..

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఐదేళ్ల నుంచీ 25 ఏళ్ల వరకూ వివిధ అంశాల్లో ఆదివారాలు,బడుల సెలవు రోజుల్లో తర్ఫీదు ఇస్తారు. దాదాపుగా మిలిటరీ ట్రైనింగ్ మాదిరిగానే ఉంటుంది. రోజూ ఉదయం, సాయంత్రం యోగా నేర్పిస్తారు. శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, మానసిక స్థైర్యం, ధైర్యం అలవడతాయి. 25 ఏళ్లు వచ్చే సరికి సామర్థ్యాన్ని బట్టి రాష్ట్రపతి అవార్డు అందుకుంటారు. శిక్షణలో వివిధ ప్రాంతాల్లో క్యాంపులకు తీసుకెళతారు.రైల్వేతో పాటు ఇతర శాఖల్లోని ఉద్యోగ నియా మకాల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కి ప్రత్యేక కోటా ఉంటుంది.రాజమహేంద్రవరంలో ఈ కోటాలో ఉద్యోగం వచ్చిన వారు ఇద్దరు ప్రస్తుతం పనిచేస్తున్నారు. విజయవాడ డివిజన్ ఉద్యోగాల్లో ఇతర డివిజన్ల వాళ్లకు అవ కా శమిస్తుండడంతో ఇక్కడ శిక్షణ తీసుకున్న వాళ్లకు అన్యాయం జరుగుతోందనే ఆవేదన ఉంది.



తుప్పలతో నిండిన రైల్వే స్కౌట్స్ శిక్షణ కేంద్రం ప్రాంగణం

అనధికారికంగా ఏర్పడిన దారి

మొంథా నష్టం రూ.38.2 కోట్లు

- వరి,మినుము పంటల నష్టం
- ప్రభుత్వానికి నివేదిక

రాజమహేంద్రవరం,నవంబరు6(ఆంధ్రజ్యోతి) :మొంథా తుఫాన్‌కు దెబ్బతిన్న పంట నష్టం తేలిందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు.ఈ మేరకు గురువారం ఆయన పంట నష్టం వివరాలు వెల్లడించారు. 31074 మంది రైతులకు చెందిన 47740 హెక్టార్లలో సర్వే చేయగా 15742.53 హెక్టార్లలో ఎన్యూమరేషన్ చేశామన్నారు.15667.56 హెక్టార్లలో పంటకు నష్టం జరిగినట్టు తేల్చారు. 74.96 హెక్టార్లను తిరస్కరించారు. దీంతో మొత్తం ఎన్యూమరేషన్ పూర్తయినట్టు ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక కూడా పంపామన్నారు. వీటికి ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం వివ రాలు తెలిపారు.వరి హెక్టారుకు రూ.25 వేలు వంతున 14602.83 హెక్టార్లకు రూ.36.5 కోట్లు,మినప పంటకు హెక్టారుకు రూ.15 వేల వంతున 1135.777 హెక్టార్లలో పంటకు సుమారు 1.7 కోట్లు నష్టపరిహారం ఇస్తారని తెలిపారు.

వనసమారాధన



జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

దేవరపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జగద్గురు ఆది శంకరాచార్య ధ్యాన మందిరం మహిళా కమిటీ సభ్యులు గురువారం స్థానిక అంబటి జయలక్ష్మి కొబ్బరితోటలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఉదయం నుంచి జమ్మి చెట్టు వద్ద దామోదర పూజలు చేసిన అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త పరమేశ్వర బయోటెక్ ఎండీ ఆనంద్ స్వరూప్, శ్రీకాకుళపు కాశీకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు చలంచర్ల రంగనాథ్, తోట సత్యనారాయణ, సీహెచ్ సత్యనారాయణ, నారాయణ విశ్వేశ్వరరావు, బళ్ల సూర్యచక్రం, మహిళా భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ భూములు లబ్ధిదారులకు అప్పగించాలి



తహశీల్దార్ నాయుడుకి వినతిపత్రం అందిస్తున్న జనసేన పార్టీ నేత సువర్ణరాజు

● జనసేన పార్టీ కన్వీనర్ సువర్ణరాజు

నల్లజర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అచ్చన్నపాలెం, సుభద్రపాలెం, చోడవరం, ప్రకాశరావుపాలెం గ్రామాల్లో ఆక్రమణకు గురైన వ్యవసాయ భూములను అసలైన రైతులకు అప్పగించాలని గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ వీఎస్‌వీ నాయుడుకి వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వంలో రీసర్వే పేరుతో రైతుల భూములు ఆక్రమణకు గురయ్యాయని, వాటి సమస్యను పరిష్కరించుకునేందుకు రైతులు సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు రైతుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చోడసాని బాపిరాజు, ఐటీ కోఆర్డినేటర్ ఉన్నమట్ల సత్యకిరణ్, మండల కార్యదర్శి కొత్తపల్లి హరిబాబు, చీపురుగూడెం పార్టీ అధ్యక్షుడు గుండబత్తుల వరుణ్, కాకర్ల రామారావు, చిల్లా వెంకటేశ్వరరావు, అనిల్ కుమార్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రేడియేటర్ హీటెక్కి ఆగిన ఆర్టీసీ బస్సు



బస్సులోంచి దిగుతున్న ప్రయాణికులు

దేవరపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి నుంచి ఏలూరు వెళ్తున్న పల్లెవెలుగు బస్సు దేవరపల్లి బస్టాండ్ వద్దకు వచ్చేసరికి రేడియేటర్ హీటెక్కడంతో పాటు స్వల్పంగా పొగ రావడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. బస్సులో దాదాపు 103 మంది వరకు ఉన్నారు. దీంతో వారందరినీ దింపివేసి వేరే బస్సులో వారి గమ్యస్థానాలకు పంపించి వేశారు. దీనిపై డ్రైవర్ యోహాన్ మాట్లాడుతూ రాజమండ్రి నుంచి ఏలూరు వెళ్తున్నామని దేవరపల్లి బస్టాండ్ వద్దకు వచ్చేసరికి బాయిలర్‌లో వాటర్ తగ్గటంతో రేడియేటర్ హీటెక్కి స్వల్పంగా పొగవచ్చిందని, దానివల్ల దేవరపల్లి బస్టాండ్‌లో నిలిపి వేయడం జరిగిందని తెలిపారు.

కాజ్‌వేను పట్టించుకోండి సారూ..?

గోపాలపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరుపాడు - సాగిపాడు ప్రధాన రహదారిపై ఉన్న అల్లీ కాల్వపై అధ్వానంగా ఉన్న కాజ్‌వేను పట్టించుకోండి సారూ అంటూ ప్రజలు అధికారులకు మొరపెడుతున్నారు. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల కాలంలో తుఫాన్లకు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వరద నీరు ప్రవహించటంతో ప్రధాన కాల్వపై నిర్మించిన కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు సాగించలేక ప్రయాణికులు నానా అగచాట్లు పడుతున్నారు.

నేడు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రీవెన్స్

కొవ్వూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలను నేరుగా కలిసి రాత పూర్వకంగా అందించవచ్చునన్నారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశం అవుతారన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు

● ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, పక్కన ఇతరులు

దేవరపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులను కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. దుద్దుకూరు రంగరాయ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ రాష్ట్ర అంతర్ జిల్లాల సెపక్‌తక్రా 2025- 26 విభాగంలో అండర్-17 బాలబాలికల పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ క్రీడా పోటీల్లో 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడలను ఎమ్మెల్యే మద్దిపాటి ప్రారంభించి మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో స్పోర్ట్స్ కోటాలో డీఎస్సీలో 14 మంది పీఈటీలు ఉద్యోగాలు సాధించారని, ప్రభుత్వం 3 శాతం క్రీడాకారులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తోందన్నారు. విద్యాశాఖ ఏఆర్‌జేడీ నాగమణి మాట్లాడుతూ 13ఉమ్మడి జిల్లాలకు చెందిన క్రీడాకారులు సెపక్‌తక్రా క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. మూడురోజుల పాటు జరిగే ఈ క్రీడాపోటీల్లో పాల్గొనే విద్యార్థులకు దుద్దుకూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కరుటూరి సూర్యారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ ముళ్లపూడి వెంకట్రావు వారి జ్ఞాపకార్థం వారి కుమారులు కురుటూరి శ్రీరామమూర్తి, కరుటూరి ధనుంజయ, ముళ్లపూడి దొరయ్యచౌదరి, ముళ్లపూడి గంగాధరరావు సహకారంతో క్రీడాకారులకు భోజన వసతి, మెమోంటోలు, మౌలిక సదుపాయాలు కల్పించారు. వారిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో సాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్, ఎంఈవోలు తిరుమలదాసు, అప్పారావు, తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, టీడీపీ అధ్యక్షుడు ఆంద్రూ అనిల్, సొసైటీ అధ్యక్షులు కరుటూరి శ్రీరామ్మూర్తి, టీడీపీ నాయకులు కొయ్యలమూడి తాతారావు, ముళ్లపూడి దొరాజీ చౌదరి, ముళ్లపూడి సత్యనారాయణ, కంటిపూడి సుబ్బారావు, అశోక్, కొయ్యలమూడి చినబాబు, గన్నమని హరికృష్ణ, కరుటూరి అబ్బులు, సుధారాణి, ఉప్పులూరి రామారావు, గన్నమని గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు

కొవ్వూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో వందేమాతర గేయం ఆలపించనున్నట్టు కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయ్యిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్‌పర్సన్ మన్నె పద్మ, గండ్రోతు అంజలీ, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, వ్యాపారులు, తదితరులు పాల్గొనాలన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ



ప్రభుత్వ ఆసుపత్రిలో పౌష్టికాహారం అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

నిడదవోలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వ ఆసుపత్రి)లో గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గొన్నాబత్తుల కృష్ణచైతన్య పుట్టినరోజును పురస్కరించుకుని గొన్నాబత్తుల సత్యనారాయణ, వెంకటేశ్వరి దంపతుల ఆర్థిక సహాయంతో 80 మందికి రోగులు, వారి సహాయకులకు పౌష్టికాహారాన్ని అందించారు. రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మీసాల మీసాల శివరామ హరిప్రసాద్, దారపురెడ్డి శ్రీరామ ప్రతాప్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



సత్యనారాయణను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

నల్లజర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పుల్లలపాడు జాతీయ రహదారిపై గురువారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు గాయపడ్డారు. ముసుళ్లకుంటకి చెందిన నందమూరి సత్యనారాయణ పండ్లు తెచ్చుకోవడానికి తన బైక్‌పై నల్లజర్ల వచ్చి తిరిగి ఇంటికి వెళుతున్న తరుణంలో పుల్లలపాడు వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు సత్యనారాయణ బైక్‌ను ఢీకొంది. దీంతో సత్యనారాయణ ఎగిరి కారు అద్దంపై పడడంతో తీవ్రగాయాలయ్యాయి. హైవే పోలీసులు అంబులెన్స్‌లో ఏలూరు ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని నల్లజర్ల పోలీసులు తెలిపారు.

యూరియా కొరత లేకుండా చర్యలు

● కొవ్వూరు వ్యవసాయ శాఖ ఏడీ సీహెచ్ శ్రీనివాసరావు



ఊనగట్ల సొసైటీలో జరిగిన సమావేశంలో పాల్గొన్న అధికారులు, తదితరులు

చాగల్లు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాబోయే దాళ్వా వరి సీజన్‌కి ఎరువులు ముఖ్యంగా యూరియా కొరత లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని కొవ్వూరు వ్యవసాయ శాఖ ఏడీ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఊనగట్ల సొసైటీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగు చేసే రైతులు ఇబ్బంది పడకుండా ముందు జాగ్రత్తతో అధికారులు వ్యవహరించాలని సూచించారు. మండలంలో సొసైటీల పరిధిలో 130 టన్నుల యూరియా, ప్రైవేట్ డీలర్ల వద్ద 60 టన్నులు యూరియా అందుబాటులో ఉందన్నారు. అందువల్ల రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి మాట్లాడుతూ అవరమైన మేరకు యూరియా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర, మద్దిపాటి వీరరాఘవులు, యంత్రప్రగట అబ్బులు చౌదరి, అబ్బూరి సీతారాముడు, వ్యవసాయ అధికారి కే. వేణుగోపాలకృష్ణ, సొసైటీల కార్యదర్శులు కేతనపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రాగోలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం



ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ ప్రసాద్, తదితరులు

తాళ్లపూడి. నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాగోలపల్లి సొసైటీ వద్ద గురువారం సొసైటీ అధ్యక్షుడు అనపర్తి ప్రసాద్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తనకు తెలపాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామాధ్యక్షుడు నీరుకొండ రమేష్, కొండేపాటి చౌదరి, కాకర్ల సురేష్, చలపాటి శివరామకృష్ణ తదితర కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.


జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా బండి



అభిశక్తుడుకి నియామకపత్రం అందిస్తున్న దృశ్యం

నిడదవోలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన బండి అభిశక్తుడుని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి గురువారం నియామక పత్రాన్ని అందించారు. దీంతో అభిశక్తుడుని నిడదవోలు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ మేడవరపు భద్రం దొర, చిన్నం మురళీకృష్ణ, తదితరులు అభినందించారు.

ప్రపంచ పర్యావరణ దోపిడీని నిరోధించే దినోత్సవం



ఇందిరమ్మ కాలనీ పాఠశాలలో మొక్కలు నాటుతున్న మానవత సభ్యులు

చాగల్లు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చాగల్లు శివారు ఇందిరమ్మ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రపంచ పర్యావరణ దోపిడీని నిరోధించే దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. దీనిలో భాగంగా మానవత అధ్యక్షుడు జుజ్జవరపు వెంకట కృష్ణప్రసాద్ వారి తల్లిదండ్రులు జ్ఞాపకార్థం 18 కొబ్బరి మొక్కలను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం పిల్లి శ్రీనివాసమూర్తి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు గువ్వాల శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో హనీఫాకు గోల్డ్‌మెడల్

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలో జూనియర్ ఇంటర్ (బైపీసీ) విద్యార్థిని ఎండీ హనీఫా మెహ్నాజ్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఐదు పతకాలను కైవసం చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి తెలిపారు. రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల చెన్నైలో జరిగిన రోలర్ స్కేటింగ్ మీట్‌లో 1000 మీటర్ల రేసులో స్వర్ణ పతకం, రోడ్ ల్యాప్, మిక్స్‌డ్ రిలే, 500 మీటర్ల రేసుల్లో వెండి పతకాలు, 500+డి రేసులో కాంస్య పతకం సాధించిందని పేర్కొన్నారు.

పిఠాపురంలో కల్తీ నెయ్యి కలకలం

● 21 డబ్బాల్లో కొవ్వు, కల్తీ నెయ్యి స్వాధీనం

● పశువుల కొవ్వుతో నెయ్యి తయారు చేస్తున్నారని ఆరోపణ

పిఠాపురంలో మరోసారి కల్తీ నెయ్యి కలకలం రేగింది. పశువుల కొవ్వు ఉపయోగించి నెయ్యి తయారు చేస్తున్నారని ఆరోపిస్తూ విశ్వహైందవ పరిషత్ ఆందోళనకు దిగడంతో అధికారులు స్పందించారు. 21డబ్బాల్లో ఉన్న పశువుల కొవ్వును సీజ్ చేశారు. గతంలో ఒకసారి ఇదే ప్రాంతాల్లో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నట్టు ఆరోపణలు రావడంతో అధికారులు కేసు నమో దుచేసి సరుకును స్వాధీనం చేసుకున్నారు.



పిఠాపురంలో అధికారులు స్వాధీనం చేసుకున్న కల్తీ నెయ్యి

పిఠాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మాధవనగర్‌లోని ఒక ఇంటిలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారనే సమాచారంతో విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు దువ్వా వెంకటేశ్వరరావు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పశువుల కొవ్వు వినియోగించి కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారని, దీనినే పవిత్రమైన ఆవు నెయ్యిగా విక్రయాలు జరుపుతూ భక్తులను మోసగించి సొమ్ము చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. గతంలోనే ఇదే రీతిలో కల్తీ నెయ్యి తయారు చేశారని తెలిపారు. కల్తీ నెయ్యి తయారీపై మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. దీంతో రెవెన్యూ అధికారులు చేరుకుని ఆ ఇంటిని సీజ్ చేశారు. గురువారం సాయంత్రం పిఠాపురం పట్టణ ఎస్ఐ మణికుమార్, ఆర్ఐ వెంకటేష్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర అప్పారావు అక్కడకు చేరుకున్నారు. కల్తీ నెయ్యి తయారీకి వినియోగిస్తున్న 21 డబ్బాల్లోని జంతువుల కొవ్వుతోపాటు అక్కడ ఉన్న కల్తీ నెయ్యిను స్వాధీనం చేసుకున్నారు. శాంపిల్స్ సేకరించి ఫుడ్ కంట్రోల్ అధికారులకు పంపారు. శాంపిల్స్ సేకరించిన తర్వాత మిగిలిన జంతువుల కొవ్వును పూడ్చివేస్తామని అధికారులు తెలిపారు. తరచూ కల్తీ నెయ్యి తయారీ ఆరోపణలు వస్తున్నా నియంత్రణ గురించి అధికారులు పట్టించుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది. తాను పలుమార్లు ఫిర్యాదు చేస్తేనేకానీ అధికారులు స్పందించలేదని విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇటువంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సత్యదేవ నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గురువారం ఒకదాత రూ.1,00,016 విరాళంగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన సీహెచ్ భరత్‌కుమార్, సాయిలక్ష్మి దంపతులు ఈ మొత్తాన్ని అన్నదాన విభాగ ఏఈవో కృష్ణారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో అన్నదాన విభాగ ఉద్యోగులు కంచిబొట్ల రాంబాబు, బండారు రమణ, తదితరులు పాల్గొన్నారు.

డైమండ్ లాకెట్ అప్పగింత

ఆత్రేయపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రూ.4 లక్షలు విలువైన డైమండ్ లాకెట్‌ను పోగొట్టుకున్న బాధితురాలికి దొరికిన మహిళ అప్పగించి ఔదార్యాన్ని చాటుకుంది. వివరాలిలా ఉన్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలానికి చెందిన టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి తన భార్యతో ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయానికి కార్తీక పౌర్ణమి బుధవారంరాత్రి స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చారు. ఆమె మెడలోని విలువైన డైమండ్ లాకెట్ గుడిలో జారిపడిపోయింది. ఈ విషయం పక్కనే ఉన్న ర్యాలి అయ్యప్పస్వామి ఆలయంలో స్వాములకు తెలియడంతో స్థానిక గ్రూపులలో బాధితురాలు పోగొట్టుకున్న విషయాన్ని పోస్ట్ చేశారు. అదే గ్రామానికి చెందిన ఇందుగుల కృష్ణవేణికి ఈ లాకెట్ దొరకడంతో అయ్యప్ప భక్తులకు అందజేశారు. స్వాములందరూ లాకెట్ పోగొట్టుకున్న బాధితురాలు ఇంటికి వెళ్లి అప్పగించారు. కృష్ణవేణిని అభినందించారు.

హైవేపై కారు దగ్ధం.. పరుగులు తీసిన జనం

తునిరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా 16వ నెంబరు జాతీయ రహదారి తునిరూరల్ వి.కొత్తూరు వద్ద కదులుతున్న కారులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కారులో జాతీయ రహదారి మీదుగా పాయకరావుపేట వైపు వెళుతుండగా ఒక్కసారిగా కారులోంచి మంటలు చెలరేగాయి. ఇది గమనించిన డ్రైవర్ వాహనాన్ని వదిలి పరుగులు తీయడంతో నిమిషాల వ్యవధిలో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో రహదారి ఇరువైపులా ప్రయాణిస్తున్న వాహనదారులు భయాందోళన చెందారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

● మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు .. పురుగుమందు తాగి మరొకరు .. కాలువలో పడి ఇంకొకరు .. చికిత్స పొందుతూ మరో వ్యక్తి ..

దేవరపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌ను వేగంగా కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గోపాలపురం మండలం దొండపూడి పంచాయతీ సాగిపాడుకి చెందిన గొంతేజు రామకృష్ణ (62) యర్నగూడెం వైపు నుంచి దేవరపల్లి వైపు వస్తుండగా హైదరాబాద్ నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదం కృష్ణంపాలెం శివారు జాతీయ రహదారి వద్ద చోటుచేసుకుంది. గొంతేజు రామకృష్ణకు ముగ్గురు కుమార్తెలు కాగా అందరికీ పెళ్లయ్యాయి. అందులో ఒక అమ్మాయికి భర్త వది లేయడంతో రామకృష్ణ వద్దే ఉంటోంది. కుమార్తె పిల్లలను రామకృష్ణే పోషిస్తున్నాడు. మృతుడు రామకృష్ణ వెండి ఉంగరాలు, మెట్టిలు, చుట్లు తయారు చేసి దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో ఊరూరా తిరిగి అమ్ముతూ ఉంటాడు. ఈయన భార్య కొన్నేళ్ల క్రితం మరణించింది. కుమార్తె టీ.పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వీ.సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతదేహాన్ని గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఉండ్రాజవరం: సూర్యారావుపాలెంకి చెందిన దువ్వాపు జయరామ్ (25) బుధవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయనకు తల్లిదండ్రులు లేకపోవడంతో ఒంటరితనం భరించలేకపో వడం వల్లే ఇలా జరిగినట్టు బంధువులు తెలిపారు. ఇతని స్వగ్రామం తాడేపల్లిగూడెం. గత కొంతకాలంగా అతని తాత ఇంటి వద్ద ఉంటున్నాడు. మృతుడి మేనమామ ఎస్. బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డీ. రవికుమార్ గురువారం తెలిపారు.

మరో ఘటనలో..

పాలంగికి చెందిన పల్లా వెంకట ఉమారాంబాబు (46) అనే వ్యక్తి కాలువలో పడి మృతి చెందినట్టు ఎస్ఐ డీ. రవికుమార్ గురువారం తెలిపారు. మృతుడు గ్రామంలో నివాసముంటూ ఈనెల 3వ తేదీన ఇంటి నుంచి స్నాక్స్ తీసుకువస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాకపోవడతో అతని భార్య కనిపించటంలేదని ఫిర్యాదు చేసింది. మృతుడు కోర్టులో ఫీల్డ్ ఆఫీసరుగా పనిచేస్తున్నారు. ఈయన అనారోగ్య సమస్యతో గత కొంతకాలంగా బాధపడుతూ జూన్ నెల నుంచి సెలవులో ఉన్నారు. గురువారం పెరవలి మండలం కాకరపర్రు పరిధిలోని నరసాపురం కాలువలో మృతదేహం స్థానికులకు కనిపించడంతో పోలీసులకు తెలిపారు. పెరవలి పోలీసులు మృతదేహాన్ని గుర్తించి ఉండ్రాజవరం పోలీసులకు తెలియజేయడంతో పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య రమాసత్యవాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కొవ్వూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఢీకొని గాయపడిన వ్యక్తి మృతిచెందినట్టు కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం రాజమహేంద్రవరం తాడితోటకు చెందిన చిట్టి వెంకటేశ్వర్లు అక్టోబరు 11వ తేదీన ఆటోలో తాళ్లపూడి కిరాయికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా కుమారదేవం ఇసుక ర్యాంపు వద్ద ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా రోడ్డుపై లారీ నిలుపుదల చేసి ఉండడంతో ఎదురుగా వాహనం రావడం వల్ల ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావుకుబలమైన రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స జరిపించారు. వారంరోజుల క్రితం ఇంటికి తీసుకువెళ్లారు. కాగా, గురువారం ఉదయం ఇంటి వద్ద మృతిచెందినట్టు కుమారుడు చిట్టి ఫణీంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్‌ఎస్ఐ తెలిపారు.